teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 02 | సంచిక : 412 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | మంగళవారం | 25 జూన్ 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## ప్రారంభమైన 18వ లోక్‌సభ ప్రత్యేక సమావేశాలు

### ప్రమాణ స్వీకారం చేసిన తెలుగు రాష్ట్రాల ఎంపీలు



న్యూ ఢిల్లీ, జూన్ 24 (తీన్మార్ న్యూస్): 18వ లోక్‌సభ ప్రత్యేక సమావేశాలు ప్రారంభం అయ్యాయి. అనంతరం ఇటీవల కొత్తగా ఎన్నికైన ఎంపీల జాబితాను లోక్‌సభ సెక్రటరీ జనరల్ ఉత్పల్ కుమార్ సింగ్ ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్‌కు అందించారు. ముందుగా ప్రధాని మోడీ

మిగతా 2 లో



## పార్టీ ఫిరాయింపులపై గుర్రుగా గులాబీ పార్టీ

### ఎమ్మెల్యేల మార్పుపై స్పందించిన కేటీఆర్

### ట్విట్టర్ వేదికగా సంచలన ట్వీట్

తెలంగాణ బ్యూరో, జూన్ 24 (తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ పార్టీలోకి ఎమ్మెల్యేలు వరుస కడుతుండడంతో ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్ పార్టీ) సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. మొన్న సీనియర్ నాయకుడు, మాజీ స్పీకర్ బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పుకోగా తాజాగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్

మిగతా 2 లో



## కమ్మేస్తున్న కాలుష్యం..

### పెరిగిన వాయు కాలుష్యం

### దేశంలో నిత్యం 464 మంది పిల్లలు మృతి

- శ్వాసకోశ వ్యాధులతో తిప్పలు
- పొంచి ఉన్న కాలుష్యం ముప్పు
- 2024 సర్వే వివరాలు వెల్లడించిన సోగా
- చెట్ల పెంపకంతో కాలుష్య నివారణకు చెక్



తెలంగాణ బ్యూరో, జూన్ 24 (తీన్మార్ న్యూస్): రోజు రోజుకు వాయి కాలుష్యం విపరీతంగా పెరిగిపోతుంది. మన దేశ రాజధాని ఢిల్లీలో ఈ విషయం ఇంకా చెప్పక్కర్లేదు.. అక్కడే కాదు కొన్ని రాష్ట్రాల్లో వాయి కాలుష్యం పెరిగిపోయి ప్రజలు శ్వాసకోశ సంబంధ వ్యాధులతో మస్తు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల నుండి, ఫ్యాక్టరీలు విడుదల చేసే కాలుష్యం, విరివిగా ఏసీల వినియోగంతో

మిగతా 2 లో




## రాష్ట్రంలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

### ఒకేసారి 44 మంది అధికారుల ట్రాన్స్‌ఫర్స్

**రాష్ట్రంలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు జరిగాయి. ఒకేసారి 44 మంది అధికారులను ప్రభుత్వం ట్రాన్స్‌ఫర్ చేసింది. ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శిగా సుల్తానియాను నియమించింది. ఆయనకు ప్రణాళికశాఖ ముఖ్యకార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ముఖ్యకార్యదర్శిగా కూడా ఆయన కొనసాగనున్నారు. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి జీవో విడుదలచేశారు.**

హైదరాబాద్, జూన్ 24 (తీన్మార్ న్యూస్): చేనేత, హస్తకళల ముఖ్యకార్యదర్శిగా శైలజా రామయ్యను బదిలీ చేశారు. ఆమెకు హ్యాండ్లూమ్స్, టీజీసీవో హ్యాండ్‌క్రాఫ్ట్స్ ఎండీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆమ్రపాలికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటివరకు ఆ స్థానంలో కొనసాగిన రొనాల్డ్ రోస్‌ను విద్యుత్ శాఖ కమిషనర్‌గా ట్రాన్స్‌ఫర్ చేశారు. ఆయనకు జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీగా అదనపు బాధ్యతలు కేటాయించారు. ఇక పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌గా ఉన్న శ్రీదేవసేనను కళాశాల, టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్‌గా బదిలీ చేశారు. పశుసంవర్ధకశాఖ ముఖ్య కార్యదర్శిగా సవ్యసాచి ఘోష్, కార్మిక, ఉపాధి శిక్షణశాఖ ముఖ్య కార్యదర్శిగా సంజయ్ కుమార్, యువజన సర్వీసులు, పర్యాటక, క్రీడలశాఖ ముఖ్య కార్యదర్శిగా వాణిప్రసాద్, అటవీ, పర్యావరణశాఖల

మిగతా 2 లో



## జడ్పీ చైర్మన్ ప్రసంగాన్ని అడ్డుకున్న మంత్రి పొన్నం

### కాంగ్రెస్ నేతలు అడ్డుకోవడంతో కాసేపు గందరగోళం

భీమదేవరపల్లి, జూన్ 24 (తీన్మార్ న్యూస్): హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గాంధీనగర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ ప్రసంగాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ నేతలు అడ్డుకోవడంతో కాసేపు గందరగోళం నెలకొంది. ఈ గ్రామంలో స్థానిక నాయకులు అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం ఆవిష్కరణ కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆ తరువాత వచ్చిన జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్ మాట్లాడుతూ గత

మిగతా 2 లో

## ఉపాధి లేక ఉసురు తీసుకుంటున్నా ప్రభుత్వం ఆదుకోదా



- సీఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి కేటీఆర్ బహిరంగ లేఖ
- నేతన్నలవి బలవన్మరణాలు కాదు ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలే
- ప్రభుత్వం పై తీవ్ర విమర్శలు చేసిన కేటీఆర్

హైదరాబాద్, జూన్ 24 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. నేతన్నలవి బలవన్మరణాలు కాదని, అవి ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలేనని చెప్పారు. ఉపాధి లేక వారు ఉసురు తీసుకుంటున్నా ప్రభుత్వం ఆదుకోదా

మిగతా 2 లో



## రాష్ట్ర సమస్యలపై ఢిల్లీకి వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి

### పలువురు కేంద్రమంత్రులు, ఏఐసీసీ అగ్రనేతలతో భేటీ

న్యూ ఢిల్లీ, జూన్ 24 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం ఢిల్లీ వెళ్లిన విషయం తెలిసిందే. ఢిల్లీలో సీఎం బిజీ బిజీగా ఉన్నారు. పలువురు కేంద్రమంత్రులను, ఏఐసీసీ అగ్రనేతలను ముఖ్యమంత్రి కలిసారు. రాష్ట్ర సమస్యలను కేంద్రమంత్రుల దగ్గరికి సీఎం తీసుకెళ్లారు. ఇందులో భాగంగానే సోమవారం మధ్యాహ్నం కేంద్ర

మిగతా 2 లో




## జూనియర్ డాక్టర్లతో చర్చలు అంసపూర్ణం

### కొన్ని ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించిన మంత్రి

### మరికొన్ని ప్రతిపాదనలపై మరోసారి చర్చించాలని నిర్ణయం

.. వివరాలు 2లో



## రాత్రి 11.30 తరువాత లాఠీలకు పని చెప్పనున్న పోలీసులు

- వరుస హత్యలపై రేవంత్ రెడ్డి సర్కార్ సంచలన నిర్ణయం
- అమలు రూల్స్ ను పాటిస్తున్న నగర పోలీసులు

హైదరాబాద్, జూన్ 24 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో వరుస హత్యలు చోటుచేసుకున్న సంగతి తెలిసింది. ఈ క్రమంలోనే రేవంత్ రెడ్డి సర్కార్ సంచలన నిర్ణయం తీసుకుంది. రాత్రి 11.30 తరువాత లాఠీలకు పోలీసులు పని చెప్పనున్నారు. శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో రాజీపడేది లేదంటూ పోలీసులు ఆకతాయిలకు వార్నింగ్ ఇస్తున్నారు. 11.30 తరువాత

మిగతా 2 లో

## తెలంగాణలో పెండింగ్ పనులను వెంటనే క్లియర్ చేయండి

### ఆదివాసీ ప్రాంతాలలో రోడ్లు నిర్మించాలి

### ఢిల్లీలో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కోరిన సీతక్క



తెలంగాణ బ్యూరో, జూన్ 24 (తీన్మార్ న్యూస్): ఆదివాసీ ప్రాంతాలలో రోడ్లు నిర్మించాలని మంత్రి సీతక్క కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. వెనుకబడిన గిరిజన ప్రాంతాలలో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద రోడ్లు నిర్మించాలని ఆమె ఢిల్లీలో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను ప్రత్యేకంగా కలిసి కోరారు. తెలంగాణలో పెండింగ్ పనులను వెంటనే క్లియర్ చేయాలన్నారు. పీఎంజీఎస్ వైలో కనెక్టివిటీ లేని 1270 ఆవాసాలను డెవలప్ చేయాల్సిన అవసరం ఉన్నదని వివరించారు. రోడ్లు

మిగతా 2 లో

## హైకోర్టును ఆశ్రయించిన మాజీ సీఎం కేసీఆర్

### రైలు రోకో కేసు విషయంలో హైకోర్టులో కేసీఆర్ పిటిషన్




హైదరాబాద్, జూన్ 24 (తీన్మార్ న్యూస్): తెలంగాణ హైకోర్టును మాజీ సీఎం, బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ సోమవారం ఆశ్రయించారు. రైలు రోకో సందర్భంగా తనపై నమోదైన కేసు విషయంలో హైకోర్టులో కేసీఆర్ పిటిషన్ వేశారు. ప్రజా ప్రతినిధుల కోర్టులోని కేసును కొట్టేయాలంటూ పిటిషన్‌లో కేసీఆర్ కోరారు. ప్రత్యేక

మిగతా 2 లో

## యూపీఎస్సీ పరీక్షలకు ఉపయోగించనున్న ఏఐ టెక్నాలజీ

### యూపీఎస్సీ నిర్వహిస్తున్న 14 కీలక పరీక్షలపై కేంద్రం కీలక నిర్ణయం




న్యూ ఢిల్లీ, జూన్ 24 (తీన్మార్ న్యూస్): నీట్, యూజీసీ నెట్ పరీక్షల పేపర్ లీకేజ్, నెట్ పరీక్ష రద్దు అంశాలు ఎన్డీఏ ప్రభుత్వానికి కొత్త తలనొప్పులు తెచ్చిపెట్టింది. ఈ క్రమంలో కేంద్ర సర్వీసు ఉద్యోగాల నియామకాల కోసం యూపీఎస్సీ నిర్వహిస్తున్న ఐఏఎస్,

మిగతా 2 లో

# కమ్మేస్తున్న కాలుష్యం

మొదటి పేజీ తరువాయి

వాయు కాలుష్యం రోజురోజుకు పెరిగిపోతూనే ఉంది. మనదేశంలో రోజుకు సగటున 464 మంది ఐదేళ్ల లోపు చిన్నారులు చనిపోతున్నారని అమెరికాలోని హెల్త్ ఎఫెక్ట్స్ ఇన్స్టిట్యూట్ విడుదల చేసిన స్టేట్ ఆఫ్ గ్లోబల్ ఎయిర్ (సొగా) 2024లో ఈ వివరాలు వెల్లడించింది. 2021లో మనదేశంలో 1.7 లక్షల మంది చిన్నారులు చనిపోయినట్లు తెలిపింది. రోజుకు సగటున 464 మంది చనిపోయారని తెలుపగా వాయు కాలుష్యమే ప్రధాన కారణమని తెలిపింది. వాయు కాలుష్యంతో న్యూ మేనియాతో పాటు శ్వాసకోస ఇన్ఫెక్షన్లు, దీర్ఘకాలిక శ్వాస కోస వ్యాధి ఆస్తమా సోకుతున్నట్లు తెలియజేసింది. రోజురోజుకి జనాభా పెరుగుతున్నా.. ప్రజలు మాత్రం చెట్ల పెంపకాన్ని చేయకుండా వాయు కాలుష్యం కోరల్లో చిక్కుక్కుపోయి అసువులు బాస్తున్నారు. మానవాళిని కాలుష్యం కాటేయకుండా ఉండాలంటే ప్రభుత్వాలు పాలకులు చెట్లను పెంచే కార్యక్రమాలను మరింతగా డెవలప్ చేయాలి. దానికి తోడు ప్రత్యేక కార్యచరణ చేపట్టి చెట్ల పెంపకం వలన కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

# పార్టీ ఫిరాయింపులపై గుర్రుగా గులాబీ పార్టీ

మొదటి పేజీ తరువాయి

సంజయ్ కుమార్ కూడా పార్టీ మారడంతో గులాబీ పార్టీలో నైరాశ్యం అలుముకుంది. పార్టీ ఎమ్మెల్యేల మార్పుపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్పందించారు. ఎక్స్ వేదికగా సంచలన ట్వీట్ చేశారు. చరిత్ర పునరావృతం అవుతుందని కేటీఆర్ ప్రకటించారు. పార్టీకి ఇలాంటి ఎదురుదెబ్బలు కొత్త కాదని పేర్కొన్నారు. అధికారంలో ఉన్న వ్యక్తుల కంటే ప్రజల శక్తి ఎల్లప్పుడూ బలంగా ఉంటుంది. గతంలో 2004-06 కాలంలో ప్రభుత్వం ప్రభుత్వం ఉన్నప్పుడు అనేక సార్లు ఫిరాయింపు ఎమ్మెల్యేలను ఎదుర్కొన్నాం. ఆనాడు ఫిరాయింపులపై తెలంగాణ ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమించడంతో రాజకీయంగా తీవ్ర పరిణామాలు ఏర్పడ్డాయి. చివరకు కాంగ్రెస్ పార్టీ తలవంచాల్సి వచ్చింది. మళ్లీ అదే చరిత్ర పునరావృతం అవుతుంది' అని కేటీఆర్ 'ఎక్స్'లో పోస్టు చేశారు. కాగా బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులు కొనసాగుతూనే ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. అంతకు ముందు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్ రావు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఇప్పటివరకు ఐదు మంది ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించారు. ఇంకా 10 మందికి పైగా ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతారని విశ్వసనీయ సమాచారం. మొత్తం 18 మందిని చేర్పించుకుని బీఆర్ఎస్ పార్టీ శాసనసభా పక్షాన్ని విలీనం చేసుకోవాలనే ప్రణాళికతో రేవంత్ అడుగులు వేస్తున్నాడు. త్వరలోనే ఈ ప్రక్రియ పూర్తి చేయాలనే పట్టుదలతో ఉన్నాడు. అయితే పార్టీ ఫిరాయింపులపై గులాబీ పార్టీ గుర్రుగా ఉంది. ఎమ్మెల్యేల పార్టీ మార్పుపై న్యాయస్థానంలో కేసులు వేశారు. ప్రస్తుతం ఆ కేసులు విచారణలో ఉన్నాయి. అయితే ఈ ఫిరాయింపులపై గులాబీ పార్టీ తీవ్ర పోరాటం చేసే అవకాశం ఉంది. ఇప్పటికే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ న్యాయ నిపుణులతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం.

# జడ్పీ చైర్మన్ ప్రసంగాన్ని అడ్డుకున్న మంత్రి పొన్నం

మొదటి పేజీ తరువాయి

భారాస ప్రభుత్వం వెయ్యికి పైగా గురుకులాలు ఏర్పాటు చేసిందని, ఇప్పుడు మరిన్ని ఎస్సీ గురుకులాలు ఏర్పాటు చేయాలని అన్నారు. గత ప్రభుత్వం దళిత బంధు కింద కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున ఇచ్చిందని, కాంగ్రెస్ హామీ ఇచ్చిన మేరకు దళిత, గిరిజనులకు రూ.12 లక్షల చొప్పున ఆర్థికసాయం అందించాలని కోరారు. ఈ దశలో మంత్రి పొన్నం అడ్డుకుని ఆయన నుంచి మైక్ లాక్కున్నారు. ఇది రాజకీయ సభ కాదని, రాజకీయాలు మాట్లాడవద్దన్నారు. సుధీర్‌కుమార్ నిర్వాహకుల నుంచి మళ్లీ మైక్ తీసుకుని మాట్లాడబోగా కాంగ్రెస్ నాయకులు అడ్డుకుని, జై కాంగ్రెస్ అంటూ నినాదాలు చేశారు. ఆయనను పోలీసులు వేదిక నుంచి కిందకు తీసుకెళ్లాక గొడవ సద్దుమణిగింది.

# జూనియర్ డాక్టర్లతో చర్చలు అంసపూర్ణం



తెలంగాణ బ్యూరో, జూన్ 24 (తీన్మార్ న్యూస్): తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ జూనియర్ డాక్టర్లు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె బాట పట్టిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహతో జూనియర్ డాక్టర్లు సోమవారం మధ్యాహ్నం చర్చలు నిర్వహించారు. అయితే, ఈ చర్చలు అంసపూర్తిగా ముగిశాయని జూడాలు పేర్కొన్నారు. కొన్ని ప్రతిపాదనలపై మంత్రి సానుకూలంగా స్పందించారని, మరికొన్ని ప్రతిపాదనలపై మరోసారి చర్చించాలని నిర్ణయించినట్లు తెలిపారు. డాక్టర్ల భద్రత గురించి ఆలోచిస్తామని, స్టైఫండ్‌కు గ్రీన్ ఛానల్‌పై మరోసారి చర్చించి నిర్ణయం తీసుకుంటామని వైద్యారోగ్య శాఖ మంత్రి చెప్పినట్లు జూనియర్ డాక్టర్లు పేర్కొన్నారు. సమ్మె కొనసాగింపుపై రాష్ట్ర స్థాయి జూడాలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. అప్పటి వరకు సమ్మె యథాతథంగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. గ్రీన్ చానెల్ ఏర్పాటు చేసి ప్రతి నెలా స్టైఫండ్ చెల్లింపు, సూపర్ స్పెషాలిటీ సీనియర్ రెసిడెంట్‌లకు రూ. 1.25 లక్షల గౌరవ వేతనం, మెడికల్ కాలేజీల్లో పెంచిన 15 శాతం సీట్లలో ఏపీ విద్యార్థులకు అవకాశం ఇవ్వకూడదని, డాక్టర్లపై దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలనే పలు డిమాండ్లతో జూనియర్ డాక్టర్లు సమ్మె చేస్తున్నారు.

# రాష్ట్ర సమస్యలపై ఢిల్లీకి వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి

రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్‌తో సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ఎంపీలు భేటీ అయ్యారు. రాజ్‌నాథ్ సింగ్‌తో సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ఎంపీల భేటీ ముగిసింది. డిఫెన్స్ భూములు, వరంగల్లో సైనిక్ స్కూల్ ఏర్పాటు ఇతర అంశాల గురించి రాజ్‌నాథ్ సింగ్‌కి విజ్ఞప్తి చేశారు. రక్షణ భూముల బదలాయింపుపై రాజ్‌నాథ్ సింగ్‌కు రేవంత్ విజ్ఞాపనలు ఇచ్చారు. హైదరాబాద్ నగరంలో రహదారులు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి రక్షణ శాఖ పరిధిలో ఉన్న భూములు కేటాయించాలని రాజ్‌నాథ్ సింగ్‌ను సీఎం కోరారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు మెహిదీపట్నం రైతు బజార్ వద్ద స్కైవాక్ నిర్మిస్తున్నామని, ఇందుకోసం అక్కడ ఉన్న రక్షణ శాఖ భూమి 0.21 హెక్టార్లను బదిలీ చేయాలని కేంద్రమంత్రిని సీఎం కోరారు. రాష్ట్రంలో స్కై వేల నిర్మాణం, రక్షణ శాఖ భూముల బదలాయింపులపై రాజ్‌నాథ్ సింగ్‌తో ముఖ్యమంత్రి రేవంత్ చర్చించారు.

# రాష్ట్రంలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

మొదటి పేజీ తరువాయి

ముఖ్యకార్యదర్శిగా అహ్మద్ నదీమ్ నియమించారు. ఆయనకు టీపీటీఆర్ఐ డీజీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీగా ఉన్న రిజ్వీని వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ శాఖ ముఖ్యకార్యదర్శిగా బదిలీ చేశారు. జీఏడీ ముఖ్యకార్యదర్శిగా సుదర్శన్‌రెడ్డిని నియమించారు. దాసరి హరిచందనను రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శిగా, హెచ్ఎండీఏ కమిషనర్‌గా సర్ఫరాజ్ అహ్మద్‌ను నియమించారు.




**బదిలీ అయిన ఐఏఎస్‌ల జాబితా**

- పశు సంవర్ధక శాఖ ముఖ్య కార్యదర్శిగా సవ్యసాచి ఘోష్
- కార్మిక, ఉపాధి శిక్షణశాఖ ముఖ్య కార్యదర్శిగా సంజయ్ కుమార్
- యువజన సర్వీసులు, పర్యాటక, క్రీడలశాఖ ముఖ్య కార్యదర్శిగా వాణిప్రసాద్
- చేనేత, హస్తకళల ముఖ్యకార్యదర్శిగా శైలజా రామయ్య
- హ్యాండ్లూమ్స్, టీజీసీవో హ్యాండ్‌క్రాఫ్ట్స్ ఎండీగా శైలజకు అదనపు బాధ్యతలు
- అటవీ, పర్యావరణశాఖల ముఖ్యకార్యదర్శిగా అహ్మద్ నదీమ్
- టీపీటీఆర్ఐ డీజీగా అహ్మద్ నదీమ్‌కు అదనపు బాధ్యతలు
- వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ ముఖ్యకార్యదర్శిగా రిజ్వీ
- జీఏడీ ముఖ్యకార్యదర్శిగా సుదర్శన్‌రెడ్డి
- హౌసింగ్, రిజిస్ట్రేషన్లు, స్టాంపులశాఖ ముఖ్యకార్యదర్శిగా జ్యోతి బుద్ధప్రసాద్
- స్పోర్ట్స్ అథారిటీ ఎండీగా సోనీ బాలాదేవి
- రవాణాశాఖ కమిషనర్‌గా కే.ఇలంబరితి
- జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆమ్రపాలికి అదనపు బాధ్యతలు
- జీహెచ్ఎంసీ, విజిలెన్స్, విపత్తు నిర్వహణ కమిషనర్‌గా రంగనాథ్
- హెచ్ఎండీఏ కమిషనర్‌గా సర్ఫరాజ్ అహ్మద్
- జలమండలి ఎండీగా కే.అశోక్‌రెడ్డి
- జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్‌గా స్నేహా శబరి
- జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్‌గా అనురాగ్ జయంతి
- జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్‌గా హెచ్‌కే. పాటిల్
- జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌గా అపూర్వ్ చౌహన్
- జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌గా ఉపేందర్‌రెడ్డి
- కళాశాల, సాంకేతిక విద్యాశాఖల కమిషనర్‌గా శ్రీదేవసేన
- సెర్ప్ సీఈవోగా డీ.దివ్య

**ప్రజావాణి నోడల్ అధికారిగా దివ్యకు అదనపు బాధ్యతలు**

- రోడ్లు, భవనాలశాఖ ప్రత్యేక కార్యదర్శిగా హరిచందన
- పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీగా ఎన్.ప్రకాశ్‌రెడ్డి
- ఎస్సీ గురుకులాల కార్యదర్శిగా అలగ్‌వర్షిణి
- గృహనిర్మాణశాఖ ప్రత్యేక కార్యదర్శిగా వీపీ గౌతమ్
- పురపాలక శాఖ డైరెక్టర్‌గా గౌతమ్‌కు అదనపు బాధ్యతలు
- ఉపాధి, శిక్షణ శాఖల డైరెక్టర్‌గా కృష్ణ ఆదిత్యకు అదనపు బాధ్యతలు
- ఐటీ ఉపకార్యదర్శిగా భవేష్ మిశ్రా
- కాలుష్య నియంత్రణ మండలి కార్యదర్శిగా జీ.రవి
- గ్రామీణాభివృద్ధి సీఈవోగా కే.నిఖిల
- ఉద్యానవన డైరెక్టర్‌గా యాస్మిన్ బాషా
- ఆయిల్‌ఫెడ్ ఎండీగా యాస్మిన్ బాషాకు అదనపు బాధ్యతలు
- ప్రొటోకాల్ డైరెక్టర్‌గా ఎస్.వెంకట్రావు
- వ్యవసాయ,సహకార సంయుక్త కార్యదర్శిగా జీ.ఉదయ్‌కుమార్
- పశుసంవర్ధకశాఖ డైరెక్టర్‌గా గోపికి అదనపు బాధ్యతలు
- ఫిషరీస్ డైరెక్టర్‌గా ప్రియాంక
- టూరిజం డైరెక్టర్‌గా ఐలా త్రిపాఠి
- రాష్ట్ర ఆర్థికసంఘం ఎండీగా కాత్యాయని దేవి
- పాఠశాల విద్యా డైరెక్టర్‌గా నర్సింహారెడ్డి
- సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా నర్సింహారెడ్డికి అదనపు బాధ్యతలు
- వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఎండీగా సహదేవరావు
- ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా అభిషేక్ అగస్త్య
- భద్రాచలం ఐటీడీఏ పీవోగా రాహుల్
- మూసీ అభివృద్ధి జేఎండీగా గౌతమి
- టీజీ ఐఐసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నిఖిల్ చక్రవర్తి.

# రాత్రి 11.30 తరువాత లాఠీలకు పని చెప్పనున్న పోలీసులు

మొదటి పేజీ తరువాయి

ఎవరైన గుమ్మిగూడితే, అలానే గొడవలు చేస్తుంటే లాఠీ ఛార్జ్ చేయనున్నారు. నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలపైనే పోలీసులు ఫోకస్ పెట్టారు. ఆదివారం రాత్రి నుంచి ఈ రూల్స్ ను నగర పోలీసులు అమలు చేయనున్నారు. పోలీసుల చర్యలకు ప్రజలు సహకరించాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్ పోలీసు కమిషన రేట్ పరిధిలో చోటుచేసుకుంటున్న వం-^స హత్యలపై పోలీసులు దృష్టి సారించారు. సామాన్య ప్రజలను భయాందోళనకు గురి చేసే వారిని అణచివేసేందుకు కఠిన చర్యలకు తెలంగాణ సర్కార్ శ్రీకారం చుట్టింది. గత వారం రోజులుగా ఊహించని విధంగా వరుస హత్యలు జరిగాయి. ఇలాంటి ఘటనలన్ని కూడా రాత్రి 11 తరువాతనే జరగాయి. దీంతో కొత్త నిబంధనలను పోలీసు అధికారులు నగరంలో అమలు చేస్తున్నారు. కొన్ని రోజుల పాటు ఫ్రెండ్లీ పోలీసింగ్ అనే ఉండదనే విషయాన్ని పరోక్షంగా చెప్పకనే చెబుతున్నారు. కేవలం బాధితులకు మాత్రమే ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలులో ఉంటుందని వారు స్పష్టం చేశారు. ఇంకా చెప్పాలంటే తుపాకులు కూడా పెట్టునేలా సీపీ స్థాయి అధికారి నుంచి ఆదేశాలు వెళ్లాయి. ఈ నిబంధనలు ఆదివారం నుంచి అమలులోకి వచ్చాయి. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న దగ్గర నుంచి సంచలన నిర్ణయాలతో పాలనలో ముందుకు సాగుతున్నారు. ఓవైపు జనాలకు సంక్షేమ పాలన అందిస్తూనే మరోవైపు పాలనలో తనదైన మార్క్ చూపిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచే డ్రగ్స్ కట్టడిపై దృష్టి పెట్టి ఆమేరకు అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. గంజాయి, మత్తు పదార్థాల కట్టడిలో కఠినంగా ఉండాలని సూచించారు. అలానే ఆహారం, వైద్యం అక్రమాలను అరికట్టేందుకు కూడా కఠిన చర్యలు తీసుకుంటున్నారు రేవంత్ రెడ్డి. ఈ క్రమంలో తాజాగా నేరాలను అరికట్టేందుకు ఈ సంచలన నిర్ణయం తీసుకున్నారు. నగరంలో దుకాణాలు రాత్రి 10.30 నుంచి 11 గంటల్లోపు మూసేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఇక నుంచి గంజాయి సరఫరాదారులను, గంజాయి తీసుకునే వారిని వదిలిపెట్టేది లేదని అర్ధరాత్రి ఎవరైనా జులాయిగా తిరిగితే కఠిన చర్యలు తీసుకుంటమని పోలీసులు హెచ్చరికాలు జారీ చేసినట్టుగా తెలంగాణ కాంగ్రెస్ తన అధికార ట్విట్టర్‌లో ఓ పోస్టర్‌ను విడుదల చేసింది.

# తెలంగాణలో పెండింగ్ పనులను వెంటనే క్లియర్ చేయండి

మొదటి పేజీ తరువాయి

మార్గం లేని 164 కు పైగా ఆదివాసీ, గిరిజన ప్రాంతాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలన్నారు. అన్ని మారుమూల ఆవాసాలకు ప్రయోజనం చేకూర్చే విధంగా కేంద్రం చర్యలు తీసుకోవాలన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం కోసం అటవీ శాఖ అనుమతులు ఇచ్చేలా చొరవ చూపాలన్నారు. మిర్యాలగూడ దివ్యాంగ బాలికపై జరిగిన లైంగిక దాడి ఘటనపై పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి , మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క స్పందించారు. నిందితుడికి కఠిన శిక్ష పడే వరకు వదిలిపెట్టబోమని వెల్లడించారు. లైంగిక దాడి ఘటన తన దృష్టి కి వచ్చిన వెంటనే జిల్లా పోలీసు అధికారులతో మంత్రి సీతక్క మాట్లాడారు. కేసు దర్యాప్తు పురోగతిని తెలుసుకున్నారు. నిందితుడిని ఇప్పటికే అరె-స్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు పోలీస్ ఉన్నతాధికారులు మంత్రికి తెలియజేశారు. దర్యాప్తును వేగవంతం చేసి నిందితుడికి కఠిన శిక్ష పడేలా చూడాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో మాట్లాడి బాధిత కుటుంబానికి అండగా ఉండాలని మంత్రి కోరారు. బాధిత బాలికకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. బాధితురాలికి ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా ఆదుకుంటామన్నారు. ఇక నాగర్ కర్నూలు జిల్లా, కొల్లాపూర్ మండలం, మొల చింతలపల్లికి చెందిన చెంచు గిరిజన మహిళ పై జరిగిన దాడి ఘటన నేపథ్యంలో, సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు

# ప్రారంభమైన 18వ లోక్‌సభ ప్రత్యేక సమావేశాలు



మొదటి పేజీ తరువాయి

చేత ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం సీనియారిటీ ఆధారంగా వరుస క్రమంలో మంత్రులు ప్రమాణ స్వీకారం చేస్తున్నారు. ఈ క్రమంలోనే తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన ఎంపీలు ప్రమాణ స్వీకారం చేస్తున్నారు. బీజేపీ స్టేట్ చీఫ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎంపీగా గంగాపురం కిషన్ రెడ్డి అనే నేను.. అంటూ తెలుగులో ప్రమాణ స్వీకారం చేశారు. కేంద్ర హోం సహాయ మంత్రి బండి సంజయ్ సైతం తెలుగులో ప్రమాణస్వీకారం చేశారు. మరోవైపు ఏపీ ఎంపీ పెమ్మసాని చంద్ర చంద్రశేఖర్, టీడీపీ నేత రామ్మోహన్ నాయుడు సైతం తెలుగులో ప్రమాణస్వీకారం చేశారు. విజయనగరం టీడీపీ ఎంపీ అప్పలనాయుడు కలిశెట్టి, రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి కూడా తెలుగులో ప్రమాణ స్వీకారం చేశారు. వైసీపీ లీడర్, అరకు ఎంపీ తనుజా రాణి హిందీలో ప్రమాణ స్వీకారం చేశారు. ఇంకా కొంత మంది తెలుగు ఎంపీలు ప్రమాణ స్వీకారం చేయాల్సి ఉంది. అయితే, తొలి రోజు మొత్తం 280 మంది చేత ప్రొటెం స్పీకర్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మొత్తం రెండు రోజుల పాటు నూతన ఎంపీల ప్రమాణ స్వీకారోత్సవాలు జరగనున్నాయి.

# హైకోర్టును ఆశ్రయించిన మాజీ సీఎం కేసీఆర్

మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర ఉద్యమంలో రైల్ రోకోకు కేసీఆర్ పిలుపునిచ్చారని పోలీసులు నివేదిక అందజేశారు. 2011 అక్టోబర్ 15, 16, 17 తేదీల్లో కేసీఆర్ రైల్ రోకోకు పిలుపునిచ్చారని పోలీసులు తెలిపారు. రైలు రోకో వల్ల రైలు రాకపోకలు, రైల్వే ఉద్యోగులకు ఆటంకం కలిగించారని పోలీసులు తెలిపారు. ఎలాంటి రైలు రోకోకు పిలుపునివ్వలేదని పిటిషన్‌లో కేసీఆర్ పేర్కొన్నారు. ఎవరో ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా కేసులు నమోదు చేశారని కేసీఆర్ పిటిషన్‌లో తెలిపారు. రైల్ రోకో ఘటన తర్వాత మూడేళ్లకు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని కేసీఆర్ పేర్కొన్నారు. ఆ కేసుకు ఎలాంటి బలం లేదని కేసీఆర్ పిటిషన్‌లో తెలిపారు.

# విడుదలైన ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ ఫలితాలు



హైదరాబాద్, జూన్ 24 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల చేసింది ప్రభుత్వం. సచివాలయంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం ఫలితాలను విడుదల చేశారు. ఫస్టియర్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరైన 2లక్షల 54వేల 498మంది విద్యార్థుల్లో 1లక్ష 62వేల 520మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. సెకండియర్ సప్లిమెంటరీ పరీక్షలకు 1లక్ష 28వేల 477మంది విద్యార్థులు హాజరు కాగా 60వేల 625మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని తెలిపారు అధికారులు. ఫస్టియర్ ఒకేషనల్ కోర్సులో 10,070 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా సెకండియర్ ఒకేషనల్ కోర్సులో 7,737 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు విద్యాశాఖ అధికారులు.

# ఉపాధి లేక ఉసురు తీసుకుంటున్నా ప్రభుత్వం ఆదుకోదా



మొదటి పేజీ తరువాయి

అని నిలదీశారు. ఇప్పటివరకు 10 మంది నేతన్నలు బలవన్మరణాలకు పాల్పడ్డారని చెప్పారు. అవి సర్కారు చేసిన హత్యలేనని తెలిపారు. ఆయా నేతన్నల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియా ఇవ్వాలన్నారు. ప్రాణాలు పోతున్న పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పదేళ్ల తరువాత మళ్లీ ఇప్పుడు నేతన్నలు బలవన్మరణాలకు పాల్పడుతున్నారని చెప్పారు. మళ్లీ సమైక్యరాష్ట్రం నాటి పరిస్థితులు ఏర్పడుతున్నాయని అన్నారు. తాము అమలు చేసిన కార్యక్రమాలు, పథకాలను, నేతన్నలకు ఆర్డర్లను కాంగ్రెస్ ప్రభుత్వం ఆపేసిందని చెప్పారు. వాటిని మళ్లీ వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని అన్నారు. గత బీఆర్ఎస్ సర్కారుపై కక్షతో నేతన్నల ప్రాణాలు బలిపెట్టవద్దని అన్నారు.

# యూపీఎస్సీ పరీక్షలకు ఉపయోగించనున్న ఏఐ టెక్నాలజీ

మొదటి పేజీ తరువాయి

ఐపీఎస్, ఐఎఫ్ఎస్‌లతో సహా దాదాపు 14 కీలక పరీక్షల పరీక్షల నిర్వహణపై కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఇక నుంచి పరీక్షల నిర్వహణలో ఏఐ టెక్నాలజీ వాడాలని నిర్ణయించింది. పరీక్షల్లో అభ్యర్థులు ఎలాంటి చీటింగ్‌కు పాల్పడకుండా ఫేషియల్ రికగ్నైజేషన్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌తో ఉండే సీసీ టీవీలను ఉపయోగించాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఉద్యోగాల కోసం లక్షల్లో అభ్యర్థులు దరఖాస్తు చేసుకుంటున్న వేళ పరీక్షలను పారదర్శకంగా, హుందాతనంగా నిర్వహించేందుకు సర్కార్ సమయత్తమైంది. ఆధార్ లింక్‌తో ఫింగర్ ప్రింట్ ధ్రువీకరణ, అభ్యర్థుల ఫేస్ రికగ్నైజేషన్, ఈ-అడ్మిట్ కార్డుల క్యూ ఆర్ కోడ్ స్కానింగ్, ఏఐ ఆధారిత సీసీ టీవీలతో అనునిత్యం మానిటర్ చేయనున్నారు.

తీన్మార్
తెలుగు దినపత్రిక

# మేనిఫెస్టోలకు మళ్లీ విలువ

ఇటీవలి ఎన్నికలలో తెలంగాణలో కాంగ్రెస్, బిఆర్ఎస్, ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి, వైఎస్ఆర్ సిపిలు మేనిఫెస్టోలు విడుదల చేశాయి. తమ ఎన్నికల సభలలో, అదే విధంగా మీడియా ద్వారా వాటికి చాలా ప్రచారం కల్పించాయి. బిజెపి జాతీయస్థాయి నుంచి అదే పని చేసింది. కాంగ్రెస్ జాతీయ స్థాయి నుంచి తెలంగాణ కోసం అదనపు మేనిఫెస్టో సైతం ప్రకటించింది. రెండు రాష్ట్రాలోనూ ప్రజలు వీటన్నింటినీ జాగ్రత్తగా గమనించి చర్చించుకున్నారు. ఇంత వరకు జరిగిన ఎన్నికలలో మేనిఫెస్టోలపై ఇంతింత ప్రచారాలు గాని, చర్చలు గాని మునుపెన్నడూ లేవు. అందుకు కారణమేమిటి అన్నది ఒక ప్రశ్న కాగా, రాగల కాలంలో దీని పర్యవసానాలు ఏమిటనేది మరొక ప్రశ్న. మన ఎన్నికల రాజకీయాలలో క్రమంగా ఒక విశేషం చోటు చేసుకుంటున్నది. అది, రాజకీయ పార్టీల మేనిఫెస్టోలకు మళ్లీ విలువ ఏర్పడుతుండటం.మేనిఫెస్టోలు ప్రతిసారి షరా మామూలుగా లేక ఒక మొక్కుబడిగా విడుదల అవుతూనే ఉంటాయి. కాని వాటికి స్వాతంత్ర్యానంతరపు మొదటి ఎన్నికలు అయిన 195152 నుంచి కొంత కాలం వరకు విలువ ఇచ్చిన ప్రజలు, తర్వాత క్రమంగా పట్టించుకోవటం మానివేశారు. ఇది నెహ్రూ కాలంలోనూ జరిగింది. ఆ వెనుక ఇందిరా గాంధీ గరీబీ హటావో నినాదం నుంచి తిరిగి విలువ వచ్చి, కొన్నేళ్లకు సమసిపోయింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి ఎన్‌టిఆర్ ఎన్నికల హామీలు ఆయన మేనిఫెస్టోకు విలువ ఇవ్వగా, తిరిగి ఇంత కాలానికి రాష్ట్ర విభజన పిమ్మట, రెండు తెలుగు రాష్ట్రాలలోనూ ఇదే స్థితి కనిపిస్తున్నది. ఈ రోజున ప్రజలు ఆయా పార్టీల మేనిఫెస్టోలలో ఏమున్నదో తెలుసుకోవటమే గాక, ఆ హామీల అమలు ఏ విధంగా సాగుతున్నదో అడుగడుగునా ఒక కంట జూస్తున్నారు. ఇంతకూ పార్టీలు మేనిఫెస్టోలను ఎందుకు జారీ చేస్తున్నాయి? వాటిని ఎందుకు అమలు చేస్తున్నాయి లేదా చేయడం లేదు? అమలు తీరును ప్రజలు ఏ పరిస్థితులలో పట్టించుకుంటున్నారు లేదా పట్టించుకోవడం లేదు? అన్నవి ప్రశ్నలు. వీటికి సమాధానాలను అన్వేషించడంలో మనకు మన దేశ స్థితిగతుల గురించి, పార్టీల బయటి స్వరూపంతో పాటు నిజమైన స్వభావాల గురించి, ప్రజల సమస్యలు, అవసరాలు, ఆలోచనలు, ఎన్నికలకు సంబంధించిన వ్యవహరణలు, పార్టీల గురించిన అవగాహనలకు సంబంధించి బోధపడేది చాలా ఉంటుంది. అయితే ఆ సుదీర్ఘమైన చర్చ ఇక్కడ చేయలేము గనుక, కొన్ని విషయాలు స్థూలంగా చూద్దాము. ఈ పని వర్తమానంతో మొదలు పెట్టి, తర్వాత వెనుకకుపోదాము. ఇటీవలి ఎన్నికలలో తెలంగాణలో కాంగ్రెస్, బిఆర్ఎస్, ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి, వైఎస్ఆర్‌సిపిలు మేనిఫెస్టోలు విడుదల చేశాయి. తమ ఎన్నికల సభలలో, అదే విధంగా మీడియా ద్వారా వాటికి చాలా ప్రచారం కల్పించాయి. బిజెపి జాతీయస్థాయి నుంచి అదే పని చేసింది. కాంగ్రెస్ జాతీయ స్థాయి నుంచి తెలంగాణ కోసం అదనపు మేనిఫెస్టో సైతం ప్రకటించింది. రెండు రాష్ట్రాలోనూ ప్రజలు వీటన్నింటినీ జాగ్రత్తగా గమనించి చర్చించుకున్నారు. ఇంత వరకు జరిగిన ఎన్నికలలో మేనిఫెస్టోలపై ఇంతింత ప్రచారాలు గాని, చర్చలు గాని మునుపెన్నడూ లేవు. అందుకు కారణమేమిటి అన్నది ఒక ప్రశ్న కాగా, రాగల కాలంలో దీని పర్యవసానాలు ఏమిటనేది మరొక ప్రశ్న. ముందుగా ఒక మాట సూటిగా చెప్పాలంటే, పార్టీల మధ్య అధికారం కోసం స్పర్ధలు పెరుగుతున్నాయి. అధికారం లభించినట్లయితే ప్రజలకు చేయగల సేవ, అభివృద్ధి ఏమిటన్నది అట్లుంచితే, అందువల్ల తమకు లభించగలది ఏమిటో వారికి బాగా తెలుసు. ఇది గతంలోనూ తెలిసిన విషయమే. కాని ఇటీవల రెండు తెలుగు రాష్ట్రాలలో, దేశం లో సంపదలు బాగా పెరుగుతున్నాయి. వాటిని తాము సంపాదించుకొనగల అవకాశాలు కూడా అందుకు తగినట్లు పెరుగుతున్నాయి. కనుక, ప్రజలను ఏ విధంగానైనా సరే మెప్పించి లేదా లోగడకన్న ఆశలను పెంచి గెలిచి తీరాలి. అందువల్ల మేనిఫెస్టోలు ఈ స్థితిని ప్రతిఫలిస్తున్నాయి. ఇది ఒక పోటాపోటీ పాప్యులిజంగా మారింది. పార్టీలకు సంబంధించిన పరిస్థితి ఇది కాగా, ప్రజలు విషయాన్ని సహజంగానే తమ కోణం నుంచి చూస్తున్నారు. ఇందులో ఇటీవల కనిపిస్తున్న మార్పు ఏమంటే, గతంలో మొత్తం సమాజపరంగా, సామూహిక సమస్యలూ పరిష్కారాల దృష్టితో చూస్తుండిన ప్రజలు ఇటీవల వ్యక్తులుగా, కుటుంబాలుగా ఆలోచించి తమకు కలిగే ప్రయోజనం ఏమిటని గమనిస్తున్నారు. అట్లా, ఎప్పటికప్పుడు ఎవరి వల్ల ఎక్కువ లాభమని చూస్తున్నారు. నిజానికి ప్రజలలో వస్తున్న ఈ మార్పు గురించి ఇప్పటికే కొందరు పరిశీలకులు ఎత్తి చూపారు. ఇది ప్రజలు వినియోగదారులుగా (కన్జ్యూమర్స్) మారటమన్న మాట. ఈ మార్పు వచ్చిన కొద్దీ వారికి ఏ పార్టీ పట్ల కూడా దీర్ఘకాలపు విధేయతలు ఉండవు. నెహ్రూ, ఇందిర, ఎన్‌టిఆర్ వంటి సందర్భాలలో వలే. ఎప్పటికప్పుడు ఎవరెక్కువ ఇస్తారో చూడటంగా మారిపోతుంది. ఇటువంటి పోటాపోటీ పాప్యులిజం, ప్రజల కన్జ్యూమరిజం వల్ల మేనిఫెస్టో రచయితలపై ఒత్తిడి పెరుగుతుంది. మేనిఫెస్టోలు ఇంకా ఇంకా ఆకర్షణీయంగా తయారవుతుంటాయి. వాటి అమలు సాధ్యాసాధ్యాలతో నిమిత్తం లేకుండా. ఓటర్లు కూడా లోపలి సరకు నాణ్యతతో నిమిత్తం లేకుండా ప్యాకేజీ ఆకర్షణ మాయలో పడినట్లు, ఏ పార్టీ తన మేనిఫెస్టోలో ఏమివ్వజూపుతున్నదనే దానికే పరిమితమవుతారు. ఒక విధంగా ఇది పెట్టుబడిదారీ మార్కెట్ తళుకు బెళుకుల యుగ ధర్మం వంటిది. ఇందుకు మూలాలు గత రెండు ఎన్నికల నుంచే ఉన్నా, ఈసారి ఆ లక్షణాలు చాలా పెరిగాయి. ఈ పరిణామ క్రమం మునుముందు ఎట్లుండవచ్చు? ఇదే విధంగా కొనసాగవచ్చునా? ఇంకా పెరగవచ్చునా? లేక పెరుగుట విరుగుట కొరకేనన్న సూత్రం ప్రకారం విరిగిపడవచ్చునా? యథాతథంగా చూసినపుడు, ఈ తరహా పోటాపోటీ పాప్యులిజానికి, ఒక రాష్ట్ర వాస్తవిక ఆర్థిక పరిస్థితులకు మధ్య వైరుధ్యం ఏర్పడుతుంది. అపుడు ఇవి విరిగిపడక తప్పదు. మరొక వైపు నుంచి చూడాలంటే, ఇటువంటి హామీల ప్రభావం తో మేనిఫెస్టోల పట్ల గతంలో లేనంతటి ఆసక్తిని చూపుతున్న ప్రజలు లేదా వాటి అమలుపై ఆశ పడుతున్నవారు, అటువంటి వైరుధ్యం మూలంగా అమలు వీలు కాదని గ్రహించినపుడు, ఆకాశం నుంచి నేల పైకి దిగిరా గలరు. దాని పర్యవసానంగా వారికి మునుముందు మేనిఫెస్టోలపై ఇటువంటి ఆసక్తి ఉండదు.అనగా మనమిపుడు ఒక కృత్రిమమైన, తాత్కాలికమైన దశలో ఉన్నాము.

# క్రీడా పాఠశాలలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్

### క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

### ప్రవేశాల వాల్ పోస్టర్ ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్



ములుగు, జూన్ 24 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లాలోని క్రీడలపై ఆసక్తి ఉన్న విద్యార్థులు క్రీడ పాఠశాలలను సద్వినియోగం చేసుకొని ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ తెలిపారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలల్లో 4వ తరగతి ప్రవేశానికి విద్యార్థిని, విద్యార్థుల ఎంపిక వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 27వ తేదీన జిల్లా స్థాయిలో నిర్వహించనున్న ఎంపికకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా క్రీడల అధికారిని ఆదేశించారు. ఇతర వివరాలకు 9849011113 నంబర్ ను సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి తుల రవి, కలెక్టరేట్ పరిపాలన అధికారి అల్లం రాజ్ కుమార్, ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

### పాల్గొన్న యూత్, కాంగ్రెస్ పార్టీ, కేయూ విద్యార్థి నాయకులు



హన్మకొండ కేయు, జూన్ 24 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవనీయులు శ్రీ రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని రైతులందరికి రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చిన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు అలువలా కార్తీక్ మాట్లాడుతూ ఈ రుణమాఫీవలన రాష్ట్రంలోని చిన్న సన్న కారు రైతులందరికీ లబ్ధి చేకూరుతుందని దీనిపట్ల రైతులందరికీ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా కాంగ్రెస్ పార్టీ అంటే మాట నిలబెట్టుకునే పార్టీ అని రుణమాఫీ చేసినందుకు రైతులంతా సంతోషంగా ఉన్నారని తెలియ జేశారు. రుణమాఫీ చేసినందుకు గాను నియోజకవర్గ రైతుల పక్షాన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మరియు మంత్రివర్గానికికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కేయూ విద్యార్థి నాయకులు మరియు యూత్ కాంగ్రెస్ నాయకులు గతంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ డిక్లరేషన్ సభలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సందర్భంగా హరీష్ రావుని తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయవలసిందిగా డిమాండ్ చేయడం జరిగింది. చెయ్యని యెడల కాంగ్రెస్ పార్టీ నాయకులు అడుగడుగునా టిఆర్ఎస్ పార్టీ నాయకులను నిలదీస్తూ వారి ఇండ్లను కూడా ముట్టడిస్తామని హెచ్చరికలు జారీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ డా.గజ్జల మల్లేశం కేయూ జేఏసీ మంద వీరస్వామి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డా. సురాసి కృష్ణ, డా. తీగల ప్రేమ్ కుమార్ మట్టెడ కుమారస్వామి యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి భీమ వినయ్ కుమార్ కూతటి సేవాగ్ పీ అరుణ్ రెడ్డి కేయూ విద్యార్థి నాయకులు కందుల శ్రీకాంత్ సురేందర్ వంశీ సాంసంగ్ శ్యాం కుమార్ విద్యార్థి నాయకులు పాల్గొనడం జరిగింది.

# మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి కనిపించడం లేదు

### - వెతికిపెట్టండంటూ ఫిర్యాదు

### జవహనగర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన దమ్మాయిగూడ కాంగ్రెస్ నాయకుడు



జవహర్నగర్, జూన్ 24(తీన్మార్ న్యూస్): మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి కనిపించడం లేదంటూ దమ్మాయిగూడ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ప్రసాద్ జవహర్ నగర్ పోలీసే స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటినుంచి మాజీ మంత్రి అక్రమాలు, భూ కబ్జాలు, ఎమ్మెల్యే అల్లుడు మర్రి రాజశేఖర్రెడ్డి అక్రమ నిర్మాణాల కూల్చివేతలతో పాటు పలు కేసులు నమోదు అయ్యాయి. అదే తరుణంలో పాలన గాలికి వదిలేసి టూర్లు చక్కర్ల పేరుతో విహారయాత్రలకు వెళ్ళి వచ్చారని, అప్పటి నుంచి నియోజకవర్గంలో కనిపించడం లేదన్నారు. అధికార పార్టీలోకి వెళ్ళాలని చర్చలు జరిపినప్పటికి స్థానిక కాంగ్రెస్ నాయకులు వ్యతిరేకించడంతో అయోమయంలో పడిన మాజీ మంత్రి కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ కూటమీ అయిన టీడీపీలో చేరేందుకు సిద్ధమౌతున్నారని సమాచారం. ఈ నేపథ్యంలో మేడ్చల్ ఎమ్మెల్యే కనిపించడం లేదని, వెతికి పెట్టాలని కోరుతూ దమ్మాయిగూడా కాంగ్రెస్ నాయకుడు ప్రసాద్ పోలీస్టే స్టేషన్లో ఫిర్యాదు చేశాడు.

# అంబేద్కర్ సేవా సమితి ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ కి వినతి



### చదువుకునేందుకు అవకాశం లేకుండా చేసిన డీఈఓ, ఎంఈఓ లపై చర్యలకు డిమాండ్

హన్మకొండ, జూన్ 24 (తీన్మార్ న్యూస్): అంబేద్కర్ సేవా సమితి ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తకి పరకాల మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాల 2018 నుండి 2024 వరకు ఆరు సంవత్సరాలుగా పాఠశాలకు తాళం వేసి పేద పిల్లలు చదువుకునేందుకు అవకాశం లేకుండా చేసిన పాఠశాల హెడ్మాస్టర్ గజ్జి సునంద పరకాల మండల ఎంఈఓ రమాదేవి మరియు హనుమకొండ డిఓ అబ్దుల్ హై వారి పైన విచారణ జరిపించి చట్ట రిత్యా చర్యలు తీసుకోవాలని వినతి పత్రం ఇవ్వడం జరిగింది.

# ప్రభుత్వ పాలన, మానవ వనరుల విభాగంలో శ్రమదానం



హన్మకొండ కేయు, జూన్ 24 (తీన్మార్ న్యూస్): సోమవారం రోజున కాకతీయ విశ్వ విద్యాలయంలోని ప్రభుత్వ పాలన మరియు మానవ వనరుల విభాగం ఆధ్వర్యంలో ప్రభుత్వ పాలన మరియు మానవ వనరుల విభాగం విద్యార్థులు మరియు పరిశోధకులు విభాగాధిపతి ప్రొఫెసర్. పెదమళ్ళ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాలన విభాగాధిపతి ప్రొఫెసర్. పెదమళ్ళ శ్రీనివాసరావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయం అభ్యున్నతికి విద్యార్థులందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడమే కాకుండా పచ్చదనం పరిశుభ్రత పాటిస్తూ చెట్లను పెంచడం ద్వారా విశ్వవిద్యాలయం అభివృద్ధికి తొడ్పాటు అందించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విభాగం అధ్యాపకులు, ప్రొఫెసర్. తోపుచర్ల యాదగిరిరావు, డాక్టర్ ఆకుతోట శ్రీనివాసులు, డాక్టర్ చీకటి శ్రీను,డాక్టర్ ఉమా శంకర్,డా. మోహన్,పరిశోధక విద్యార్థులు విభాగం విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇటుక బట్టీలకు చెరువు మట్టి

- దిర్శించర్ల చెరువు మట్టి ఇటుక బట్టీలకు తరలింపు
- పదుల సంఖ్యలో జేసిబిలు వందల సంఖ్యలో ట్రాక్టర్ల మట్టి తరలింపు
- వందల సంఖ్యలో నల్ల మట్టి తరలిస్తున్నా అధికారుల మౌనం దేనికి సంకేతం
- నల్ల మట్టి దందాకు దారులుగా అధికారుల తీరు
- పంట పొలాలకు వెళ్లాల్సిన మట్టి బట్టీలకు తరలింపుతో రైతుల ఆవేదన
- యాదేచ్ఛగా నల్ల మట్టి దందా జరుగుతున్న అధికారులు చర్యలు తీసుకోవకపోవడం బట్టీ నిర్వాహకులకు అనుకూలమే అంటున్న స్థానికులు
- చెరువుల సంరక్షణ పేపర్ ప్రకటనలకు, ఆఫీస్ లకే పరిమితమా
- చెరువు మట్టి చేరబట్టి బట్టీ నిర్వాహకులకు దోచిపెడుతున్న వ్యాపారులపై చర్యలేవి
- ఇరిగేషన్ అధికారులు ఆఫీస్ లకే పరిమితం అయితే చెరువుల సంరక్షణ బాధ్యత ఎవరిదీ.....?
- రెండు రోజులుగా చెరువులో అక్రమ తవ్వకాలు
- తరలిపోయిన సుమారు వేల ట్రిప్పులు మట్టి
- పట్టించుకోని అధికారులు
- ఇరిగేషన్ అధికారులు మౌనం వీడి నల్ల మట్టి అక్రమంగా బట్టీలకు తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు





నేరేడుచర్ల, జూన్ 24 (తీన్మార్ న్యూస్): నేరేడుచర్ల మండలం, దిర్శించర్ల గ్రామంలోని చెరువు మట్టి అక్రమార్కులకు వరంగా మారింది వేల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా మట్టిని బట్టీలకు తరలిస్తు సొమ్ము చేసుకుంటున్నారు. రాజకీయ నాయకుల ప్రోద్బలం మామూళ్లకు అలవాటుపడిన అధికారుల అలసత్వం, పర్యవేక్షణ లోపం కారణంగా లక్షలాది రూపాయలు విలువ చేసే చెరువు మట్టి అక్రమంగా ఇటుక బట్టీలకు చేరుతుంది. చెరువు లో నీళ్లు ఎండిపోవడంతో వేలాది ట్రిప్పుల చెరువు మట్టిని అడ్డూ అదుపు లేకుండా బహిరంగానే ట్రాక్టర్ల ద్వారా బట్టీలకు తరలిస్తున్నారు. ఎవరైనా కంప్లైంట్ చేసిన రాజకీయ నాయకుల ప్రోద్భలంతో సంబంధిత శాఖ అధికారులు వెనక్కితగ్గడంతో అక్రమార్కులపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా తూతూమంత్రంగా వారిని మందలించి ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదంటూ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీనిని అదునుగా తీసుకున్న సదరు అక్రమార్కులు రెండు రోజులుగా ఇటుక బట్టీలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మూడు రోజుల నుండి ఈ తతంగం జరుగుతున్నా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండటంపై గ్రామస్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు ఆక్రమణలు మరోవైపు అక్రమంగా మట్టి దందా జరుగుతున్నా అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని పలు శాఖల అధికారులకు మామూళ్లు అందుతుండటం వల్లే చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### మేము ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు : అమరేందర్ రెడ్డి , ఇరిగేషన్ డీఇ

దిర్శించర్ల చెరువు నుంచి మట్టిని ఇటుక బట్టీలకు తరలిస్తున్నట్లు తెలిసింది. మేము పంట పొలాలకు తోలుకోవడానికే అనుమతులు ఇచ్చాము. బట్టీలకు తోలుతున్నట్లు సమాచారం వస్తే వెంటనే మా సిబ్బందిని అక్కడికి పంపించాం పంట పొలాలకు తోలుతున్నట్లు తెలిపారు. అనుమతి లేకుండా చెరువులో మట్టిని తవ్వరాదు. అక్రమంగా బట్టీలకు మట్టిని తరలించే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# నియమ నిబంధనలు పాటించని విద్యా సంస్థల గుర్తింపు రద్దు చేయాలి

**ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అదనపు జిల్లా కలెక్టర్ కి వినతి పత్రం**

**మంద శ్రీకాంత్ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి**



హన్మకొండ, జూన్ 24 (తీన్మార్ న్యూస్): హన్మకొండ నగరంలో జిల్లా కేంద్రంలో ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించకుండా నడుస్తున్నటువంటి ప్రైవేట్ కార్పొరేటు విద్యాసంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకొని ఆ విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు స్టాలిన్ మంద శ్రీకాంత్ అన్నారు సోమవారం రోజున హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా ఆదనపు కలెక్టర్ రాధిక గుప్తకి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంద శ్రీకాంత్ మాట్లాడుతూ నగరంలో విచ్చలవిడిగా ప్రైవేటు కార్పొరేట్ విద్యా సంస్థలు రెచ్చిపోతున్నారన్నారు ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించకుండా విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర లక్షల రూపాయల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు అలాగే అక్రమంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు యూనిఫాంసు అమ్ముతున్నారు ఇంత జరుగుతున్న జిల్లా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు అంతేకాకుండా నగరంలో కొత్త కొత్త హెూల్డింగ్ల తోటి ఎలాంటి అనుమతులు లేకుండా కొన్ని స్కూల్స్ కాలేజీలు ప్రైవేట్ కార్పొరేట్ విద్య సంస్థలను నడుపుతున్నారన్నారు. ఈ విషయంపై తమరు స్పందించి ఆ విద్య సంస్థలను గుర్తించి వాటి గుర్తింపును రద్దుచేలన్నారు. లేదంటే ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జస్వంత్ సాయి సందీప్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# తాళాలు వేసిన ఇండ్లనే టార్గెట్ చేసి దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితుల రిమాండ్





నారాయణ్ పేట జిల్లా ప్రతినిధి, జూన్ 24(తీన్మార్ న్యూస్): నారాయణ్ పేట జిల్లా మక్తల్ నియోజకవర్గం, మాగానూర్ మండలంలోని వర్కూర్ గ్రామంలో ఎన్ లింగయ్య జల్సాలకు అలవాటు పడి ఇండ్లకు తాళాలు వేసి ఉన్న ఇండ్లనే టార్గెట్ చేసి దొంగతనాలు చేస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచి జైలుకు పంపించడం జరుగుతుందని డిఎస్పి ఎన్ లింగయ్య తెలిపారు. నారాయణపేట జిల్లా కేంద్రంలోని డిఎస్పీ కార్యాలయంలో పత్రిక సమావేశం ఏర్పాటు చేసి మాగనూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని వర్కూరు గ్రామంలో రెండు ఇండ్లలో దొంగతనాలకు పాల్పడిన వారి వివరాలను డిఎస్పి తెలిపారు. తేదీ:20.06.2024 నాడు అర్ధరాత్రి వర్కుర్ గ్రామం లో తాళం వున్న ఇంటికి తాళాలు పగులగొట్టి బంగారు నగలు వెండి వస్తువులను దొంగతనం చేయగా వర్కుర్ గ్రామానికి చెందిన ఇంటి యజమాని బొజ్జ మొల్ల సుజాత పిర్యాదు మేరకు సోమవారం రోజు మగానూర్ పోలీస్ వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి ఈ రోజూ అనగా తేదీ:24.06.2024 నాడు ఉదయం 07:00 గంటలకు మగానూర్ పోలీస్ వారు నమ్మదగిన సంచారం మేరకు నల్లగట్టు మారెమ్మ గుడి దగ్గరలో ఇద్దరు అనుమనితులైన వ్యక్తులను పట్టుకొని విచారించగా వారిలో ఒక వ్యక్తి వర్కూర్ p గ్రామానికి చెందిన ఊరుముందర నరేశ్ కార్తీక్ S/o లక్షమప్ప వయస్సు:-24సం.లు మరియు అతని స్నేహితుడు కర్నూల్ జిల్లా దేవనకొనడ మండలం పి.కోటకొండ గ్రామానికి చెందిన బోయ వీరేంద్ర తండ్రి ఉరుకుంద ఇద్దరు గత 3 నెలలు గా పరిచయం ఏర్పడి ఇద్దరు కలిసి జల్సాలకు అలవాటు పడినారు. ఎలాగైనా డబ్బులు సంపాదించాలనే ఊదేశ్యంతో, ఇద్దరు కలిసి తేదీ:19.06.2024 వార్కూర్ గ్రామానికి వచ్చినారు. అక్కడే రెండు రోజులు ఉండి రెక్కీ నిర్వహించి తాళాలు వేసిన ఇండ్లను అదునుగా చూసి వర్కూర్ గ్రామంలోని నరేష్ ఇంటి వెనకాల వున్న రెండు ఇండ్లలో తాళం వేసి ఉన్నాయి అని చూసి 20.06.2024 నాడు అర్ధరాత్రి ఇద్దరు కలిసి తాళాలు విరగగొట్టి దొంగతనం చేసినారు. వారి ఇంటిలో అందాజ 6 తులల బంగారం వాటి విలువ రూ.3,00,000/- లక్షల రూపాయలు మరియు 1.5 తులల వెండి మరియు 200 చిల్లర పైసలు మరియు ఒక మొబైలు ఫోన్ దొంగతనం చేసినారు. ఈ రోజు మాగనూర్ పోలీస్ వారు పట్టుకొని వారిని విచారించి వారి నుండి 5.5 తులల బంగారూ ఆభరణాలు (నేకలెస్, లాంగ్ చైన్, కమ్మలు చిన్న ఉంగరం ) మరియు 1.5 వెండి వస్తువులు మరియు ఒక సాంసంగ్ మొబైలు ఫోన్ మరియు 8560/- రూయలు వారి నుండి స్వాదినాము చేసుకొని ఈ రోజు వారిని అరెస్ట్ చేసి నారాయణపేట కోర్టు ముందు హాజరు పరిచి కోర్టు ఆదేశాల మేరకు వారిని జైల్ కు పంపిచ్చడం జరిగినది,అని డి.ఎస్.పి ఎం లింగయ్య తెలిపారు. ఈ కేసును రెండు రోజుల్లో ఛేదించినందున మక్తల్ సీఐ చంద్రశేఖర్, మాగనూరు ఎస్సై అబ్దుల్ ఖాదర్, హెడ్ కానిస్టేబుల్ గోపికృష్ణ, కానిస్టేబుల్స్ రవీందర్ సాయికుమార్, రాజశేఖర్ లను డీఎస్పీ అభినందించి వారికి త్వరలో రివార్డు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.


# కాంగ్రెస్ ఏర్పడ్డ తర్వాత మొట్టమొదటి డిగ్రీ కళాశాల

**- దేవరకద్ర నియోజకవర్గానికి కేటాయించడం సంతోషకరం**

**- దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి**



మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి, జూన్ 24(తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత మొట్టమొదటి డిగ్రీ కళాశాల దేవరకద్ర నియోజకవర్గానికి కేటాయించడం సంతోషకరమని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి అన్నారు. మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యాశాఖ అధికారులు, ఇంటర్మీడియట్ అధ్యాపక బృందంతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ డిగ్రీ కళాశాల భవన నిర్మాణం పూర్తి అయ్యే వరకు,ప్రస్తుత విద్యా సంవత్సరం గాను, డిగ్రీ కళాశాల తరగతులను ఇంటర్మీడియట్ కాలేజ్ భవనంలో కొనసాగించాలని తెలిపారు. డిగ్రీ కళాశాల మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి,ఆర్థిక అనుమతులు ఇచ్చిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ విద్యా సంవత్సరం నుండి డిగ్రీ కళాశాల ప్రక్రియ మొదలైందని, మొత్తంగా 240 సీట్లు అందుబాటులో ఉన్నాయని ఈ నెల 28వ తారిఖ్ నుండి దోస్త్ యాప్ లో వెబ్ ఆప్షన్ లో నమోదు చేసుకుని,డిగ్రీ కాలేజీ లో అడ్మిషన్లు పొందగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్ రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# విద్యా వ్యవస్థపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

**- విద్యా శాఖ మంత్రిని వెంటనే నియమించాలి**

**- బిజెవైయం కార్యదర్శి బన్నే శివ మోదీ**



ఇబ్రహీంపట్నం, జూన్ 24(తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలని బిజెవైయం కార్యదర్శి బన్నే శివ మోదీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టి 6 నెలలు గడుస్తున్న నేటికీ విద్యా వ్యవస్థపై చిత్తశుది లేధని విద్యాశాక మంత్రిని నియమించక విద్యార్థులు ఇబ్బందికి గురవుతున్నారు. ఉపాధ్యా కొరత నెలకొన్నది తక్షణమే ఫీజు రియంబర్స్మెంట్, నిరుద్యోగ భృతి, బకాయిలు చెల్లించాలని బిజెవైయం కార్యదర్శి శివమోదీ అన్నారు. 15 రోజులోగా విద్యాశాఖ మంత్రిని నియమించకపొతే పెద్ద ఎత్తున్న ఆందోళనలు, రాస్తారోకోలు, ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

# డబుల్ బెడ్రూమ్ ఇండ్లలో సమస్యలను పరిష్కరించాలి

**- బాధితులతో కలిసి వినతపత్రం**

**- మండలం సిపిఐఎం పార్టీ నాయకులు**




మహబూబ్నగర్ జిల్లా ప్రతినిధి, జూన్ 24(తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా, మదనాపురం మండల కేంద్రంలోని డబుల్ బెడ్రూమ్ ఇండ్లలో సమస్యలను పరిష్కరించాలని మండల సీపీఐఎం డిమాండ్ చేసింది. మండల కార్యదర్శి వెంకట్రాములు అధ్వర్యంలో ఇండ్లలో ఉంటున్న ప్రజలందరూ తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. తహశీల్దార్ అబ్రహాం లింకన్, ఎంపీఓ పుష్పకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వెంకట్రాములు మాట్లాడారు. లబ్ధిదారుల కు ఇండ్లను ఇచ్చి 8 నెలలు అయ్యిందని,వసతులు లేక సతమతం అవుతున్నారని గుర్తు చేశారు. త్రాగడానికి మంచి నీటి వసతి లేక బిందెలతో దూరం వెళ్లి తెచ్చుకుంటు త్రాగే పరిస్తితి ఏమిటి పరిస్థితి వచ్చిందన్నారు. బాత్రూమ్ లోని నీళ్ళు బయట రోడ్లపై పారుతుంద న్నారు. డ్రైనేజీలు లేకపోవడంతో బురదలోనె నడుస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వెల్లడించారు. వాటి వల్ల దోమల బెడద ఎక్కువ అయ్యి రోగాలు వస్తున్నాయని వెల్లడించారు. ఇండ్లలో వసతుల ఏర్పాటు సక్రమంగా లేకపోవడంతో కిరాయిల ఇండ్లలో ఉంటూ జీవనాన్ని సాగిస్తున్నారన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించి లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చీర్లప్రసాద్, వెంకటేష్, చెన్నయ్య, డబుల్ బెడ్రూమ్ ఇండ్ల ప్రజలు పాల్గొన్నారు.

# ఎల్లుండి రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు బంద్

**- ఏబీవీపీ పిలుపు**




ఆత్మకూర్, జూన్ 24(తీన్మార్ న్యూస్): ఆత్మకూరు మండల కేంద్రంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన ఏబీవీపీ రాష్ట్ర వ్యాప్త పాఠశాల బంద్ కు పిలుపునివ్వడం జరిగిందని తెలంగాణ రాష్ట్ర ఏబీవీపీ కార్యవర్గ సభ్యులు సాయికుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పదేళ్ల తెలంగాణలో ప్రభుత్వం మాత్రమే మారింది కానీ విద్యార్థుల సమస్యలు ఏమాత్రం మారలేదు అని ప్రభుత్వ పాఠశాలలో కనీసం మౌలిక వసతులు కూడా నోచుకోకపోవడం లేదని అన్నారు. ప్రైవేటు మరియు కార్పొరేట్ పాఠశాలలో ఫీజులు యదేచ్ఛగా వసూలు చేస్తున్నారని దాన్ని విద్యాశాఖ అధికారులు అడ్డుకట్ట వేయాలని అన్నారు. అనంతరం 10 డిమాండ్లతో కూడిన పత్రిక ప్రకటనను వారు విడుదల చేశారు. ఇట్టి కార్యక్రమంలో ఏబీవీపీ ఎస్ఎఫ్డి కన్వీనర్ అఖిల్, మండల కార్యదర్శి రాజేష్, ఆదిత్య,ఉదయ్ గౌడ్, సందీప్,రవి వర్మ, తదితరులు పాల్గొన్నారు.

# చిక్కులు వీడితేనే మాఫీసాఫీ

**- గత ప్రభుత్వ హయాంలో రుణమాఫీలో పలు సమస్యలు**

**- సర్కారు లక్ష్యం నెరవేరాలంటే వాటిని అధిగమించాల్సిందే..!**

**- మార్గదర్శకాలు ఎలా ఉంటాయనే దానిపై రైతుల ఆసక్తి.. ఆరా..**

**- కుటుంబాన్ని ప్రాతిపదికగా తీసుకుంటారేమోనని అనుమానం**

**- ఖాతా నంబర్లలో లోపాలు వెతికి తిరికాసు పెట్టొద్దని విజ్ఞప్తి**

**- విధివిధానాలు వెల్లడైతేనే అపోహలకు ఫుల్‌స్టాప్**




ఖమ్మం: గత ప్రభుత్వం వ్యవసాయ రుణమాఫీ పథకంలో రకరకాల కొర్రీలు పెట్టడంతో పాటూ అనేక సాంకేతిక సమస్యలూ ఎదురయ్యాయి. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అధిగమిస్తేనే పథకం ఉద్దేశం నెరవేరుతుందని రైతులు, రైతుసంఘాల నేతలు అంటున్నారు. గతంలో లాగా కాకుండా ఏకకాలంలో రూ.2లక్షల లోపు వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తామని మంత్రివర్గం నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నా.. కొర్రీలు లేకుండా సాఫీగా అమలు చేయాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది. అమలు విషయంలో ఎలాంటి డౌట్ లేకున్నా.. విధివిధానాలపై మాత్రం పలు సందేహాలు తలెత్తుతున్నాయి. గత ప్రభుత్వం 2018 డిసెంబర్ 12లోపు పంట రుణాలన్నింటినీ మాఫీ చేస్తామని హామీ ఇచ్చినా.. అమలు నాటికి కొర్రీలు పెట్టింది. కుటుంబం ప్రాతిపదికగా అనడంతో అనేక రకాల సాంకేతిక సమస్యలు ఉత్పన్నమయ్యాయి. ఈ ప్రభుత్వం కూడా అలాంటివేవైనా తలపెడితే రైతుల నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశమూ లేకపోలేదు. 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9 వరకు ఐదేండ్లలో రైతులు తీసుకున్న రూ.2 లక్షల వరకు రుణాన్ని ఒకేసారి మాఫీ చేస్తామని ప్రభుత్వం మాటిచ్చింది. ఇందుకు రూ.31వేల కోట్లు కేటాయించింది. 47 లక్షల మంది రైతులను లబ్దిదారులుగా సూచించింది. అన్నీ బాగానే ఉన్నా మార్గదర్శకాలు ఎలా ఉంటాయనే దానిపైనే రైతుల్లో ఆసక్తి నెలకొంది.

**పరిమితులపై రైతుల్లో ఉత్కంఠ..**

రుణమాఫీని సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం ప్రకటించిన నేపథ్యంలో మార్గదర్శకాలు ఎలా ఉంటాయన్న దానిపై రైతుల్లో ఉత్కంఠ నెలకొంది. త్వరలో జీవో విడుదల చేస్తామని సీఎం చెప్పినా ఎలాంటి పరిమితులు ఉంటాయనే చర్చ సాగుతోంది. రైతుల పంట రుణాల మాఫీలో పీఎం కిసాన్ మార్గదర్శకాల్లో కొన్నింటిని అమలు చేస్తారనే ప్రచారం సాగుతోంది. పీఎం కిసాన్ పథకం నుంచి రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్నవారిని మినహాయించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ఆదాయ పన్ను చెల్లించేవారినీ పరిగణలోకి తీసుకోలేదు. రుణమాఫీ విషయంలోనూ వీరిని మినహాయించే అవకాశం ఉంది. ఆదాయ పన్ను చెల్లించే వారందర్నీ కాకుండా అధిక ఆదాయం ఉన్నవారిని, అధిక భూమి ఉన్నవారిని మినహాయిస్తారనే ప్రచారం సాగుతోంది.

**కొర్రీలు లేకుండా చూడాలి**

గతంలో పలు రకాల కొరీ్రలు పెట్టారు. కుటుంబాన్ని ప్రాతిపదికగా తీసుకుంటే మాత్రం చాలా సాంకేతిక సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉంది. ఆధార్, రేషన్‌కార్డు, ఒకవేళ రేషన్‌కార్డు లేకపోతే గత ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వేను ప్రాతిపదికగా తీసుకుంది. కానీ దీనివల్ల 'ఫ్యామిలీ గ్రూపింగ్' కాక అనేక సాంకేతిక సమస్యలు వచ్చాయి. అలా కాకుండా రైతు ప్రాతిపదికగా రుణమాఫీ చేసినా గతంలో అక్షరం మారినా తిరకాసు పెట్టారు. ఒక రైతుకు రెండు బ్యాంకుల్లో రుణాలుంటే రెండింటిలోనూ ఒకేలా పేరు ఉండాలి. స్పెల్లింగ్‌లో తేడా వస్తే మాత్రం మాఫీకి అనర్హులను చేశారు. ఖమ్మం జిల్లాలోని కారేపల్లి, కూసుమంచి, తిరుమలాయపాలెం, ముదిగొండ మండలాల్లో ఇలాంటివి చోటుచేసుకున్నాయి. ఒక కారేపల్లిలోనే 750 మంది అకౌంట్లు స్పెల్లింగ్ మిస్టేక్స్ కారణంగా నిలిచిపోయాయి. ఇంకా అనేక రకాల కొర్రీలు తలెత్తాయి. వాటన్నింటినీ అధిగమించి ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాల్సి ఉంది.

**ఖమ్మం జిల్లాలోనే రూ.4.3 వేల కోట్ల రుణాలు**

2023 డిసెంబర్ 31 నాటికి ఖమ్మం జిల్లాలో 3,73,157 మంది రైతులు 28 బ్యాంకుల నుంచి రూ.4,307.58 కోట్ల పంట రుణాలు తీసుకున్నారు. 2018 డిసెంబర్ 12 నుంచి లెక్కిస్తే వీరిలో ఎందరు రుణమాఫీకి అర్హత సాధిస్తారో చూడాలి. ప్రాథమిక అంచనా ప్రకారం జిల్లాకు రూ.వెయ్యి కోట్లకు పైనే అవసరం అవుతాయి. ప్రభుత్వం ప్రస్తుతం ఈ పథకానికి కేటాయించిన రూ.31వేల కోట్లలో రూ.2 లక్షలకు పైగా రుణం తీసుకున్న వారిని సైతం లెక్కించారు. ఇలా గుర్తించిన లబ్దిదారుల సంఖ్య 45 లక్షలకు చేరింది. విధివిధానాలు ఖరారు అయితేనే ఈ పథకం తీరుపై పూర్తిస్థాయి స్పష్టత వస్తుంది.

## మరోసారి సత్తా చాటిన ములుగు జిల్లా ఇంటర్ విద్యార్థులు

**జిల్లా ఇంటర్మీడియట్ విద్య శాఖఅధికారి పీ వెంకటేశ్వర్లు**

ములుగు, జూన్ 24 (తీన్మార్ న్యూస్): సోమవారం తెలంగాణ ఇంటర్ బోర్డు హైదరాబాద్ మే నెలలో నిర్వహించిన ఇంటర్ మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫలితాలు ప్రకటించడము జరిగినది. ఇందులో ములుగు జిల్లా విద్యార్థులు మరొక సారి తమ సత్తా నిరూపించుకొని జిల్లాను రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానము లో నిలపడము జరిగినది. మొదటి సంవత్సరం 741 మంది పరీక్ష వ్రాయగా 632 మంది పాస్ కావడం వలన 85.29% శాతంలో రాష్ట్రంలో ప్రథమస్థానము. రెండవ సంవత్సరము 232 మంది పరీక్ష వ్రాయగా 189 మంది పాస్ కావడం తో 81.49 % శాతం తో రాష్ట్రంలో ప్రథమస్థానము. రీవెరిఫికేషన్, రికౌంటింగ్ కొరకు అప్లయి చేయదలచిన విద్యార్థులు https://tgbie.cgg.gov.in ద్వారా రీవెరిఫికేషన్ కొరకు రూ.600.00, రికౌంటింగ్ కొరకు రూ.100 చెల్లించి 25.6.2024 నుండి 29.6.2024 వరకు Student online services లో అప్లయి చేసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్య శాఖ అధికారి, P. వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు.

# ఇట్లుంటె ఎట్లొస్తరు.. అధ్వాన్నంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీలు

## నాగిరెడ్డిపేట ప్రభుత్వ కళాశాల తీరు
## గదులు లేవు.. వసతులు కరువు
## చేరేందుకు ఇష్టపడని విద్యార్థులు

నాగిరెడ్డిపేట, జూన్ 24 : నలభై ఏండ్ల కల నెరవేరిందని సంబురపడాలో.. కనీస వసతులు లేక బాధపడాలో..తెలియని స్థితిలో నాగిరెడ్డిపేట ప్రభుత్వ కళాశాల విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. చిరకాల స్వప్నం అయిన ప్రభుత్వ జూనియర్ కళాశాల గతేడాది అప్పటి ఎమ్మెల్యే జాజాల సురేందర్ మంజూరు చేయించారు. మండల కేంద్రంలోని గోపాల్‌పేట ఉన్నత పాఠశాలలో తరగతులను ప్రారంభించారు. కళాశాల కోసం సమీపంలోని మాల్తుమ్మెద విత్తనక్షేత్రంలో ఉన్న వ్యవసాయ పాలిటెక్నిక్ పక్కన రెండు ఎకరాల స్థలాన్ని ఎంపిక చేశారు. ప్రభుత్వ పాఠశాలలో కేవలం ఒక్క గదిని మాత్రమే కేటాయించడంతో ఒక టేబుల్, రెండు కుర్చీలతో కళాశాల కొనసాగుతున్నది. కనీస వసతులు లేకపోవడంతో విద్యార్థులు ప్రైవేట్‌కు మొగ్గుచూపుతున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న పాఠశాలలో విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ఉండడం, గదుల కొరతతో విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతుండడంతో కళాశాల గదిని ఖాళీ చేసి వెళ్లిపోవాలని ప్రధానోపాధ్యాయులు కోరుతున్నట్లు కళాశాల అధ్యాపకులు చెబుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, స్పందించి కళాశాలను కాపాడుకోవడానికి కృషి చేయాలని కోరుతున్నారు.

**అధ్యాపకులు, గదుల కొరత..**

కళాశాల మంజూరైన నాటి నుంచి ఇప్పటి వరకు ఒక్క తరగతి గది కూడా ఏర్పాటు చేయలేదు. ఎల్లారెడ్డి ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్



హేమచందర్‌ను నియమించగా ఇటువైపు కన్నెత్తి చూసిందీ లేదు. అదే కళాశాలకు చెందిన జూనియర్ లెక్చరర్ నాగయ్యను ఇక్కడికి డిప్యుటేషన్‌పై బదిలీ చేశారు. ఒక అటెండర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో కళాశాలనిర్వాహణ తూతూ మంత్రంగా ముందుకు సాగుతున్నది.

**ప్రచారం లేదు..విద్యార్థులు రారు**

జూనియర్ కళాశాల ఉన్నట్లు అధ్యాపకులు ప్రచారం చేయకపోవడంతో అసలు మండలంలో కళాశాల ఉన్నట్లు కూడా మరిచిపోయారు. అన్నీ ఉచితంగా అందించి, స్కాలర్‌షిప్ సౌకర్యం ఉన్నా సరైనా సమాచారం ఇచ్చే వారు లేక అప్పులు చేసి మరి ప్రైవేట్ కళాశాలకు వెళ్లి చదువుకుంటున్నారు. కళాశాలలో తెలుగు, ఆంగ్లం భాషలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో బీపీసీ, ఎంపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీలో ఒక్కో తరగతికి 80 మందికి పైగా విద్యార్థులకు గాను ఇప్పటి వరకు కేవలం 56 మంది విద్యార్థులు జాయిన్ అయ్యారు. పరిస్థితి ఇలానే కొనసాగితే కళాశాల నిర్వాహణ కష్టమేనని పలువురు విద్యావంతులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు.

# బీజేపీలోకి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి..! జగిత్యాల జిల్లాలో జోరుగా చర్చ..!!

జగిత్యాల : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పార్టీ అధినాయకత్వంపై అలకబూనిన సంగతి తెలిసిందే. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌ను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవడంపై జీవన్ రెడ్డి తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఈ క్రమంలో తన అనుచరుల ఫోన్ ఎత్తకుండా ఆయన అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. అయితే జీవన్ రెడ్డిని కరీంనగర్, మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీలు బండి సంజయ్, ఈటల రాజేందర్ కలుస్తారని వార్తలు షికారు చేస్తున్నాయి. జీవన్ రెడ్డిని భారతీయ జనతా పార్టీలోకి ఆహ్వానించే అవకాశం ఉందని జోరుగా చర్చలు కొనసాగుతున్నాయి. ఈ వార్తలపై జీవన్ రెడ్డి ఇప్పటి వరకు స్పందించలేదు. సంజయ్ చేరికపై పార్టీ అధిష్ఠానం కనీసం తనకు సమాచారం ఇవ్వకపోవడంతో జీవన్ రెడ్డి అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. కాగా, సంజయ్ చేరికపై కాంగ్రెస్ శ్రేణులు ఆగ్రహంగా ఉన్నారు. దీంతో సోమవారం ఉదయం నుంచే జీవన్‌రెడ్డి ఇంటికి పార్టీ నాయకులు భారీ సంఖ్యలో చేరుకుంటున్నారు. అయితే ఈ విషయమై పార్టీ అధిష్ఠానం ఆయనతో మాట్లాడుతున్నట్లు సమాచారం. పార్టీ ఫిరాయింపులపై జీవన్‌రెడ్డి వ్యాఖ్యలు చేసిన మరుసటి రోజే తన నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేని కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. ఏ రాజకీయ పార్టీ అయినా సిద్ధాంతాలకు అనుగుణంగా



పనిచేయాల్సి ఉంటుందని అన్నారు. రాష్ట్రంలో 65 మంది ఎమ్మెల్యేలతో కాంగ్రెస్ ప్రభుత్వం సుస్థిరంగా ఉన్నదని, ఇతర పార్టీల నాయకులను చేర్చుకోవాల్సిన అవసరం ఉందని తాను భావించడం లేదని తెలిపారు. ఇలాంటి వాటిని తాను వ్యక్తిగతంగా ప్రోత్సహించనని స్పష్టంచేశారు. అయితే ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే సంజయ్ కుమార్ సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. దీంతో జగిత్యాల రాజకీయంగా ఆసక్తికరంగా మారింది. 2014లో జీవన్‌రెడ్డి చేతిలో ఓడిపోయిన సంజయ్.. ఆ తర్వాత జరిగిన 2018, 2023 ఎన్నికల్లో ఆయనపై విజయం సాధించారు.

# ముందుకు కదలని ధరణి

- ప్రహసనంగా ధరణి కమిటీ
- మొక్కుబడి సమావేశాలు, సిఫారసులపై భిన్నాభిప్రాయాలు
- ఎండోమెంట్, అటవీ భూములపై తేలని లెక్కలు
- తహసీల్దార్, ఆర్డీవోలకు బదిలీ కాని అధికారాలు
- క్షేత్ర స్థాయిలో ఎక్కడి సమస్యలు అక్కడే
- పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు 3లక్షలు
- డిజిటల్ సంతకం కోసం 1.8 లక్షల ఎకరాలు
- 130 రకాలకుపైగా రెవెన్యూ సమస్యలు
- ధరణి పోర్టలా? భూ భారతా?
- ఏటూ తేల్చుకోలేక పోతున్న సర్కార్

హైదరాబాద్: రాష్ట్రంలో పేరుకు పోయిన భూ సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ధరణి కమిటీ ముందుకు కదలడం లేదు. భూ వ్యవస్థలోని లోటుపాట్లను సవరిస్తూ, వాటికి శాశ్వత పరిష్కారం కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఈ కమిటీ ప్రహసనంగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పోర్టల్‌లో చేయాల్సిన మార్పులు, పలు సిఫారసుల విషయంలో భిన్నాభిప్రాయాలు ఏర్పడటంతోనే ప్రభుత్వానికి నివేదిక సమర్పించడంలో కాలయాపన జరుతున్నదని తెలుస్తోంది. ఫలితంగా ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకు పోయాయి. రెండు విడతల్లో చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో దాదాపు లక్షా 20 వేల ఫైళ్లను పరిశీలించి నివేదికలు తయారు చేశామని అధికారులు అంటున్నారు. అయితే అందులో ఒక్క ఆర్జీ కూడా ధరణి పోర్టల్‌లో ఇప్పటి వరకు అప్‌డేట్ కాలేదు. భూ సమస్యల పరిష్కారం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2020లో తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌తో రాష్ట్రంలో భూసమస్యలు తగ్గక పోగా మరింతగా పెరిగాయి. ఈ పోర్టల్ అమల్లోకి రాకముందు 75 రకాల భూ సమస్యలుంటే, ధరణి వచ్చాక ఆ సమస్యల సంఖ్య 130కి పెరిగిందని భూ నిపుణులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో గత డిసెంబర్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో కొత్తగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ భూ సమస్యల పరిష్కారం కోసం మార్చిలో ధరణి కమిటీని ఏర్పాటు చేసింది. చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ నవీన్ మిట్టల్ నేతృత్వంలో ఏర్పాటైన ఈ కమిటీకి నెల రోజుల్లో నివేదిక సమర్పించాలని గడువు విధించారు. నాలుగు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు పూర్తి స్థాయి నివేదిక అందించలేదు. పోర్టల్ అందుబాటులోకి తీసుకొచ్చినప్పుడు తెచ్చిన ఆర్వోఆర్ చట్టం అమలు చేసేందుకు అవసరమైన మార్గదర్శకాలేమీ ధరణిలో లేవు. మండల, డివిజనల్, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఎలాంటి సమస్యలు పరిష్కరించాలో ఏ స్థాయి అధికారికి ఏయే అధికారాలు ఉంటాయన్న మార్గదర్శకాలు పొందుపరచలేదు. వీటికి సంబంధించి ఏవిధమైన సిఫారసులు, సూచనలు చేయాలనే విషయంలో సభ్యుల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయని తెలుస్తున్నది. దీనికి తోడు అటవీ, దేవాదాయ భూముల లెక్కలు కొలిక్కి రావడం లేదు. భూచట్టాలన్నింటిని ఒకే గొడుగు కిందికి తీసుకొచ్చి, కొత్తగా ఆర్ఓఆర్ చట్టం తీసుకురావాల్సిన అవసరముందని సభ్యుల మధ్య ఏకాభిప్రాయం వ్యక్తమవుతున్నప్పటికీ ఏలా ముందుకెళ్లాలనే అంశంలో సమన్వయం లేదని తెలుస్తోంది. అదే సందర్భంలో ధరణి పేరుతోనే పోర్టల్‌ను ఉంచాలా? దాని పేరు మార్చి భూ భారతి పేరుతో కొత్త పోర్టల్‌ను అందుబాటులోకి తేవాలా అనే విషయంలోనూ ప్రభుత్వం ఓ నిర్ణయానికి రాలేక పోతున్నదని సమాచారం.

**పెండింగ్ దరఖాస్తులు 3 లక్షలు**

రెవెన్యూ అధికారుల లెక్కల ప్రకారం ధరణి పోర్టల్‌లో ప్రస్తుతం 1 నుంచి 33 వరకు టెక్నికల్ మాడ్యూల్స్ (టీఎం) ఉన్నాయి. ఈ మాడ్యూళ్లలో పరిష్కారం కోసం గత ప్రభుత్వంలో 2.46 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రెండు దఫాలుగా నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో మరో 60 వేలకు పైగా కొత్తగా దరఖాస్తులు వచ్చాయి. దీంతో మొత్తం దరఖాస్తుల సంఖ్య 3 లక్షలు దాటాయి. మరో 1.8 లక్షల ఎకరాల భూములకు సంబంధించి డిజిటల్ సంతకాల (డీఎస్) కోసం భూ యాజమానులు ఎదురు చూస్తున్నారు.. ఇవే కాకుండా సాదా బైనామా కోసం 9.5 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని పరిష్కరించేందుకు ధరణి పోర్టల్‌లో ప్రస్తుతం అవకాశం లేదు. అమల్లోకి తెచ్చిన ఆర్వోఆర్–2020 చట్టంలో చిన్నపాటి సవరణ చేస్తే సాదాబైనామా కోసం నిరీక్షిస్తున్న లక్షలాది మంది బాధితులకు న్యాయం జరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వివిధ మాడ్యూల్స్‌లో ఉన్న సమస్యల పరిష్కారం వేగంగా జరిగేందుకు మార్చిలో సీసీఎల్, కలెక్టర్ల వద్ద ఉన్న అధికారాలను ఆర్డీవో, తహసిల్దార్లకు ప్రభుత్వం బదిలీ చేస్తూ నిర్ణయం తీసుకుంది. కాని మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు అధికారా బదిలీ పూర్తి కాలేదు. దాంతో క్షేత్ర స్థాయిలో ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకు పోయాయి. అధికారాలను బదిలీ చేస్తే పెండింగ్‌లో ఉన్న 3లక్షల దరఖాస్తుల్లో సగానికి పైగా పరిష్కారం అయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# నిత్యావసరాలకు ధరల మంట

**-బ్లాక్ మార్కెట్ కు సరుకులు**

**-పట్టింపు లేని అధికారులు**

**-వినియోగదారులకు తప్పని నిలువు దోపిడీ**

పెద్దపల్లి ప్రతినిధి: జిల్లా కేంద్రంలో నిత్యావసరాలకు ధరల మంటరోజు రోజుకు పోటెకుతున్నది. వినియోగదారులు అంత ధరలు పెట్టి కొన లేకపోతున్నారు. ఇందులో రెండు అంశాలు మిలితమై ఉండగా ప్రజలు మాత్రం సాధారణ ధరల పెరుగుదల అనే భ్రమలో ఉన్నారు. అసలు విషయం ఏంటంటే ప్రజలకు అందాల్సిన నిత్యావసరాల్లో కొన్ని బ్లాక్ మార్కెట్ కు తరులుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వర్షాలు లేకపోవడంతో పంట దిగుబడి తగ్గుతుందనే ఆలోచనలో ఉన్న వ్యాపారులు కొంతమంది కృత్రిమ కొరత సృష్టిస్తూ తమ తమ గోదాముల్లో నిల్వ చేసుకుంటున్నారు. దీంతో ఒక్కసారిగా ధరలు ఆకాశానంటుతున్నాయి. ఇటు రోజు వారిగా తీసుకునే కూరగాయల మంటలు తగ్గక పోగా, ఇటు పప్పు దినుసులు ఒకటికి మూడింతల రేట్లు అధికంగా ఉన్నాయి. దీనికి తోడుగా హోల్ సెల్ వ్యాపారులు సిండికేట్ గా మారి రేట్లు పెంచుతున్నారని పలువురు బహిరంగంగానే అంటున్నారు. ఇంత జరుగుతున్న జిల్లా అధికారులు మాత్రం వారికి ఏమి పట్టనట్లుగా వ్యవహారిస్తున్నారు. ఓ వైపు కల్తీలతో పెద్దపల్లి జిల్లా ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, వ్యాపారుల తూకంలో కోతలు పెడుతూ అడ్డగోలుగా దోచుకుంటున్నారని వినియోగదారులు ఆవేదన చెందుతున్నారు. అయినా కూడా అధికారులు తమ విధులను విస్మరించి కళ్ళు మూసుకొని వేతనాలు పొందు తున్నారని ప్రజలు పలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇటు కృత్రిమ ధరల మంట... అటు నాణ్యత లేని సరుకులు దీనికి తోడుగా తూకంలో కోతలు వేస్తున్నా ఏ ఒక్కరు స్పందించకపోవడంలోని ఆంతర్యమేమిటో ప్రజాప్రతినిధులకు, జిల్లా అధికారులకే తెలియాలి.జిల్లా కేంద్రమైన మండల, గ్రామస్తాయిల్లో మనం కొనుగోలు చేసే ప్రతి వస్తువును ఎంఆర్ పీ రేటుకు తీసుకొని, బిల్లు ఇవ్వాల్సి ఉన్నా ఎక్కడా కూడా ఇది జరగడం లేదు. దీని వల్ల ప్రభుత్వ ఆదాయనికి పెద్ద మొత్తంలో గండి పడుతుందనే చెప్పాలి. ఇటు ప్రజలకు అటు ప్రభుత్వానికి సేవ చేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తడం లోని ఆంతర్యం ఏమిటో సదరు అధికారులు చెప్పాలి. జిల్లా కేంద్రానికి, మండల కేంద్రాలకు అనుకొని ఉన్న ఊర్లలో మొదలుకొని, ప్రతి గ్రామ పంచాయతీ లలో ప్రతి కిరాణా షాపుల్లో ప్రతి వస్తువు మీద ఎం ఆర్ పీకంటే ఎక్కువ మొత్తంలో తీసుకుంటున్నారు. శీతల పానీయాల మీద కూలింగ్ చార్జీల పేరుతో అధిక మొత్తం వసూలు చేస్తున్నారు.దీనిపై అధికారులు తక్షణవే స్పందించాలని పలువురు వినియోగదారులు కోరుతున్నారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

**– జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్**

మహబూబాబాద్:వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. నేడు సమీకృత కలెక్టరేట్ భవన సముదాయం లోని కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అదనపు కలెక్టర్ రెవెన్యు ఎం.డేవిడ్ తో కలిసి వైద్యాధి కారులతో, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీ, మున్సిపల్, విద్యాశాఖ, సంక్షేమ శాఖ, సంక్షేమ హాస్టళ్ళ అధికారులు సమన్వయం చేసుకుంటూ సీజనల్ వ్యాధులను అరికట్టాలని సూచించారు. పారిశుధ్య నిర్వాహణ పనులను సక్రమంగా చేపట్టి ప్రజలు డెంగీ, మలేరియా, చికున్ గున్యా లాంటి వ్యాధుల బారిన పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. డ్రెయినేజీలు ఎప్పటికప్పుడు శుభ్ర పరచాలన్నారు. త్రాగు నీరు కలుషితం కాకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఎప్పటికప్పుడు నీటి ట్యాంకులను శుభ్ర పరిచి క్లోరినేషన్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలని సూచించారు. నీరు నిలువ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీరు నిలువ ఉండే చోట ఆయిల్ బాల్స్ వేయాలని, దోమలు రాకుండా ఫాగింగ్ చేయాలని తెలిపారు. వారానికి రెండు రోజులు అనగా డ్రై డే పాటించాలని అన్నారు.వర్షా కాలంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటివి పూర్తి నియంత్రణలో ఉండేలా చూసుకోవాలని ముఖ్యంగా పరిసరాల పరిశుభ్రత లోపించడం, దోమలు, ఈగలు వ్యాప్తిచెందడం కారణంగా వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉందని కావున దీన్ని దృష్టిలో ఉంచుకొని పారిశుధ్యం పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, ఇంటి పరిసరాల్లో నీరు నిలువ ఉండడం వల్ల దోమలు, ఈగలు వృద్ధి చెంది అంటు వ్యాధులకు కారణ మవుతాయని అలా జరగకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. సమావేశం లో చర్చించు కున్న అంశాలన్నీ ఆచరణలోకి తీసుకురావాలని అధికారు లకు సూచించారు. ముఖ్యంగా గ్రామాల్లో పంచాయతీ రాజ్, అంగన్ వాడీ, ఆశ, స్వయం సహాయక సంఘాల తో పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, పట్టణాల్లో మునిసిపల్ సిబ్బంది తో సమన్వయం చేసుకొని వార్డులలో ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, పాటశాలలో, కాలేజి, హాస్టళ్ళలో పరిశుభ్రతపై విద్యార్టులకు అవగాహన కల్పించాలని అన్నారు. ప్రోగ్రాం అధికారులు సందర్భన ప్రణాళికలు రూపొందించుకొని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ రోజు వారీగా యాక్షన్ ప్లాన్ నివేదికలు రూపొందించి అందజేయాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాదికారి డాక్టర్ కళావతి బాయి, డిప్యుటీ సి.ఈ.ఓ నర్మద, డి.డి. ట్రైబల్ వెల్ఫేర్ ఎర్రయ్య, సంక్షేమ అధికారి వరలక్ష్మి, డి.పి.ఓ హరిప్రసాద్, ఎస్.సి, మైనారిటీ శాఖల అధికారులు బాలరాజు, శ్రీనివాసరావు, డి.ఈ.ఓ రామారావు, మిషన్ భగీరథ ఈ.ఈ. ఎం.కిషన్ రెడ్డి, అడిషనల్ డి.ఆర్.డి.ఎ. శాంతి కుమారి, డిప్యుటీ డి.ఎం.హెచ్. ఓ అంబరీష్,మహబూబాబాద్, తొర్రూరు మునిసిపల్ కమిషనర్లు నరేందర్, నరేష్ రెడ్డి, రంజిత్, ప్రోగ్రాం అధికారులు బిందు శ్రీ, డాక్టర్ సుధీర్ రెడ్డి, నాగేశ్వర్ రావు, హెల్త్ ఎద్యుకేటర్లు కె.వి.రాజు, పురుషోత్తం, డి.డి.ఎం రాజ్ కుమార్ పాల్గొన్నారు.

# మునిసిపల్ కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి దామోదర రాజనర్సింహ

సంగారెడ్డి: సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో 8 కోట్ల 40 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించిన మున్సిపల్ పరిపాలన భవనాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ , మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు, పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం కార్యాలయం ఆవరణలో ఏర్పాటుచేసిన జాతీయ జెండా స్తంభం, మహనీయుల విగ్రహాలను ఆవిష్కరించారు. రెండు కోట్ల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన గద్దర్ మల్టీపర్పస్ ఆడిటోరియం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. శర వేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్ చెరు నియోజకవర్గ అభివృద్ధికి అందరి భాగస్వామ్యం అవసరమన్నారు. ఈదులనాగుల పల్లి, న్యూ యంఐజీ కాలనీ మధ్య కనెక్టివిటీ రోడ్డు నిర్మాణాన్ని త్వరలో చేపడతామన్నారు తెల్లాపూర్ మునిసిపాలిటీ లో అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణం 15రోజుల్లో మొదలు పెడతామని హమీ ఇచ్చారు. చెరువులను, కుంటలను కాపాడుకోవాలి.. ప్రకృతిని రక్షించుకోకపోతే భవిష్యత్తు తరాలకు మనుగడ ఉండదని హితవు పలికారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం చేపట్టే ప్రతిపనిలో ప్రజలు సహకరించాలని కోరారు.. ఈ సందర్భంగా మెదక్ పార్లమెంట్ సభ్యులు యంపి రఘునందన్ రావు మాట్లాడుతూ.

తెలంగాణ పురం శాసనం ద్వారా తెల్లాపూర్ కు ఎంతో చారిత్రాత్మక నేపథ్యం ఉందని, తెలంగాణపురం అనే పేరును పెట్టే అంశంపై ప్రభుత్వం పరిశీలించాలని డిమాండ్ చేశారు. .తెల్లాపూర్ అండర్ పాస్ రైల్వే బ్రిడ్జిని పొడిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో , జిల్లా పరిషత్ చైర్ పర్సన్ మంజు శ్రీ జైపాల్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ లలితా సోమిరెడ్డి, వైస్ చైర్మన్ రాములు గౌడ్, బిఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు దేవేందర్ యాదవ్, కౌన్సిలర్లు కో ఆప్షన్ సభ్యులు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**-బయోమెట్రిక్ విధానం ద్వారా వైద్యులు, సిబ్బంది హాజరు నమోదు**

**-మాతా, శిశు ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెరిగేందుకు**

**-జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

పెద్దపల్లి : ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి, మాతా శిశు సంరక్షణ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా ఆస్పత్రిలో ఉన్న జనరల్ ఓ.పి., దంత వైద్య విభాగం, కంటి వైద్య విభాగం, ఎముకలు, కీళ్ల నొప్పుల విభాగం, ఆపరేషన్ థియేటర్, జనరల్ వార్డ్ , సైక్రియాటిక్ విభాగాలను కలెక్టర్ తనిఖీ చేసి ప్రజలకు అందిస్తున్న వివిధ రకాల వైద్య సేవల వివరాల గురించి అడిగి తెలుసుకున్నా రు. ఆసుపత్రికి సాధారణంగా ఓ.పి. ఎంతమంది రోగులు వస్తున్నారు, ఎటువంటి వ్యాధులు అధికంగా నమోదవుతున్నాయి వంటి అంశాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వైద్యం అందిస్తున్న రోగులకు వారి వైద్య చికిత్స కోర్స్ పూర్తి అయ్యే వరకు ఫాలో అప్ చేయాలని, డ్యూటీలో ఉన్న వైద్యుల వివరాలు నోటీసు బోర్డుపై పరిశీలించిన కలెక్టర్ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య అధికారులకు సూచించారు. అనంతరం జిల్లా ఆసుపత్రి సమీపంలో గల మాతా, శిశు సంరక్షణ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి ఓటి బ్లాక్, పోస్ట్ ఆపరేటివ్ వార్డ్, చిన్నపిల్లల ఓపి, ఆరోగ్య మిత్ర, మందులు ఇచ్చే గది, పోస్ట్ నెటల్ వార్డు, రిసెప్షన్ లను తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ఉన్న రికార్డులను పరిశీలించిన కలెక్టర్ ప్రతి రోగి వివరాలు పకడ్బందీగా నమోదు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లా ఆసుపత్రి, మాతా శిశు సంరక్షణ కేంద్రంలో ఉన్న రోగులతో కలెక్టర్ మాట్లాడుతూ, ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ జిల్లా ఆసుపత్రి, మాతా శిశు సంరక్షణ కేంద్రంలో పనిచేసే వైద్యులకు, వైద్య సిబ్బందికి, ఇతర సిబ్బందికి బయోమెట్రిక్ విధానం ద్వారా హాజరు నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ ను కలెక్టర్ ఆదేశించారు. వైద్యులు సకాలంలో విధులకు హాజరు కావాలని కలెక్టర్ సూచించారు. మాతా, శిశు ఆసుపత్రిలో నెలకు ఎన్ని ప్రసవాలు అవుతున్నాయో అడిగి తెలుసు కున్న జిల్లా కలెక్టర్, ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య మరింత పెంచేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని, తల్లి, బిడ్డల ఆరోగ్యాన్ని సంరక్షించేందుకు ప్రభుత్వ ఆసుపత్రులలో ఉన్న సదుపాయాలను ప్రజలకు తెలియజేస్తూ, మరిన్ని ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాకాంత్, సంబంధిత వైద్య, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సెంచరీ దాటేసిన టమోటా...

హైదరాబాద్: రాష్ట్రంలో కూరగాయలు ధరలు మండిపోతున్నాయి. డిమాండ్కు తగ్గట్టుగా ఉత్పత్తిగా లేకపోవటంతో కొద్దిరోజులుగా ధరలు పెరుగుతూ వస్తున్నాయి. మొన్నటి వరకు రూ. 80లోపు ఉన్న టమాట, పచ్చి మిర్చీ ధర? ఇప్పుడు ఏకంగా సెంచరీ మార్క్ ను దాటేసింది. మరికొద్దిరోజులు ధరలు తగ్గే అవకాశం లేదని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. హైదరాబాద్ కూరగాయల మార్కెట్లలోని ధరలు చూస్తే? కిలో టమాట ధర 100కు చేరింది. ఇక పచ్చి మిర్చీ ధర ఏకంగా రూ. 120కు చేరింది. కేజీ బీరకాయ ధర రూ. 100గా ఉండగా? గోరు చిక్కుడు ధర కూడా రూ. 100కు చేరింది. దీంతో మార్కెట్ లోకి వెళ్లిన విక్రయదారులు? ఏ కూరగాయలు కొనాలన్న ఆలోచించే పరిస్థితి ఉంది. కిలో టమాట ధర రూ. 80గా ఉంది. పచ్చి మిర్చీ ధర కూడా రూ. 70 - 80 మధ్య పలికింది. గోరు చిక్కుడు ధర రూ. 50 నుంచి 60 మధ్య ఉంది. బెండకాయ కిలో ధర రూ. 60-80 మధ్య ఉంది. కానీ రెండు రోజుల వ్యవధిలోనే వీటి ధరలు భారీగా పెరిగిపోయాయి. దీంతో వినియోగదారులు మార్కెట్ కు వెళ్లాలంటేనే వణికిపోతున్నారు. చేతినిండా డబ్బులు తీసుకెళ్లిన సంచి సగానికి కూడా కూరగాయలు రావట్లేదంటూ సామాన్యులు వాపోతున్నారు. ఈ ఏడాది వేసవిలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో?. కూరగాయల ఉత్పత్తి భారీగా తగ్గిపోయింది. మే మాసంలో సగం రోజులు పూర్తి అయ్యాక రాష్ట్రంలో వర్షాలు మొదలయ్యాయి. దీంతో సీన్ క్రమంగా మారిపోయింది. వానలతో తడిసిపోవటంతో పాటు త్వరగా కుళ్లిపోవటం సమస్యగా మారింది. పక్క రాష్ట్రాల నుంచి భారీ మొత్తంలో కూరగాయలను దిగుమతి చేసుకుంటున్న పరిస్థితులు ఉన్నాయి. వీటి రవాణ ఖర్చులు కూడా అధికంగా ఉంటున్నాయి. హైదరాబాద్ నగరంలోని ప్రధాన మార్కెట్లకు ప్రస్తుతం వస్తున్న కూరగాయల్లో 70 నుంచి 80 శాతం పక్క రాష్ట్రాల నుంచే వస్తున్నాయి. మన రాష్ట్రం నుంచి కేవలం 20 శాతం లోపే ఉంది. ఇక వానల రాకతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు సంభవిస్తున్నాయి. దీంతో త్వరగా కూరగాయలు కుళ్లిపోతుండటంతో వ్యాపారస్తులు దిగుమతులను క్రమంగా తగ్గిస్తూ వస్తున్నారు. రాష్ట్రంలో చూస్తే? ఈ సీజన్ లో కొంత కరువు ఛాయలు కనిపించాయి. నీటి వసతి లేక చాలా ప్రాంతాల్లో కూరగాయల సాగు తగ్గింది. వీటి ప్రభావంతో కూడా ప్రస్తుతం మార్కెట్ లో కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. తెలంగాణలో పండిన పంట కేవలం 71క్వింటాళ్లు మాత్రమే. మిగిలిన పంట ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్రల నుంచి దిగుమతి అవుతుంది. ఇందులో 1000క్వింటాళ్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మదనపల్లి నుంచి వచ్చింది. తెలంగాణలోని వికారాబాద్, శామీర్పేట్, సిద్దిపేట, భువనగిరి, గద్వాల, గజ్వేల్, మేడ్చల్, జహీరాబాద్, తూప్రాన్, ప్రాంతాల నుంచి రావాల్సినంత టమాట పంట రావడం లేదు. తీవ్రమైన ఎండల వేడికి టమాట పంట తగ్గడమే ఇందుకు కారణమని వ్యాపారులు, అధికారులు చెబుతున్నారు. టమాట ధరల పెరుగుదల మిగతా కూరగాయలపై పడింది. దీంతో మార్కెట్లో కూరగాయ ధరలు మండిపోతున్నాయి. పచ్చిమిర్చి కిలో రూ. 120 నుంచి రూ. 140వరకు పలుకుతోంది. మొన్నటి వరకు రూ. 100 లకు నాలుగు కిలోలు వచ్చే ఉల్లిగడ్డలు ప్రస్తుతం వందకు రెండి కిలోలే వస్తున్నాయి. అంటే కిలో ఉల్లి ధర రూ. 50 పలుకుతోంది. కొత్తి మీర ధర కూడా భారీగానే పెరిగింది. కిలో కొత్తి మీర రూ. 200 పైనే పలుకుతోంది. ఫ్రెంచ్బీన్స్ రూ. 175 నుంచి 210, టమాటా రూ. 100నుంచి 120, దొండకాయ రూ. 70నుంచి 80, బీరకాయ రూ. 80నుంచి 100, బెండకాయ రూ. 80నుంచి 100, కాకరకాయ రూ. 80, క్యారెట్ రూ. 80గా ఉన్నాయి. పంట ఉత్పత్తి గణనీయంగా పడిపోవడంతో అన్నిరకాల కూరగాయల ధరలకు రెక్కలు వచ్చాయి. మార్కెట్ కు రూ. 500 పట్టుకు వెళితే కనీసం సంచి అడుగుకు కూడా నిండడం లేదని సామాన్యులు వాపోతున్నారు. నిత్యం వంటల్లో వినియోగించే టమాటా, పచ్చిమిర్చి ధరలు హోల్ సేల్లోనే కిలో రూ. 100 దాటింది. కాగా రిటైల్ మార్కెట్లోత కిలో రూ. 120 వరకు అమ్ముతున్నారు. ఆలుగడ్డ, చామగడ్డ లాంటివి కూడా కిలో రూ. 60కి తగ్గడం లేదు. అన్నిరకాల కూరగాయల ధరలు పెరగడంతో సామాన్యులు మార్కెట్ కు వెళ్లాలంటే జంకుతున్నారు. మరికొద్దిరోజులు కూడా పరిస్థితులు ఇలాగే ఉండే అవకాశం ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో వానకాలం సాగు నడుస్తోంది. ఇందుకు సంబంధించిన పంట జూలై, ఆగస్టు మాసంలో చేతికి వస్తుంది. వీటి ఉత్పత్తులు మార్కెట్లకు చేరితే? మళ్లీ ధరలు తగ్గే అవకాశం ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు. అప్పటివరకు సామాన్యుల జేబులకు చిల్లు పడే అవకాశం ఉందని అంటున్నారు?!

# బీహార్‌లో నితీష్ కుమార్ ప్రభుత్వానికి గట్టి ఎదురుదెబ్బ

పాట్నా: ;బీహార్‌లో నితీష్ కుమార్ ప్రభుత్వానికి గట్టి ఎదురుదెబ్బ లో నితీష్ కుమార్ ప్రభుత్వానికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. దళితులు, వెనుకబడిన తరగుతుల, గిరిజనులకు రిజర్వేషన్ కోటాను 50 శాతం నుంచి 65 శాతానికి పెంచాలని గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పాట్నా హైకోర్టు గురువారం కొట్టివేసింది. రిజర్వేషన్ కోటాను పెంచుతూ 2023 నవంబర్‌లో రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై చీఫ్ జస్టిస్ కె వినోద్ చంద్రన్ నేతృత్వంలోని పాట్నా హైకోర్టు డివిజన్ బెంచ్ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. బీహార్‌లో కులాలపై సమగ్ర సర్వే జరిపిన రాష్ట్ర ప్రభుత్వం ఎస్సి, ఎస్టి, ఓబిసి, ఇబిసిల జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ కోటాను 50 నుంచి 65 శాతానికి పెంచుతూ కొత్త చట్టాన్ని తీసుకువచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంస్థలలో ఈ అణగారిన వర్గాలకు రిజర్వేషన్ కోటాను 50 నుంచి 65 శాతానికి పెంచుతూ గత ఏడాది నవంబర్ 21న ఒక గెజిట్ నోటిఫికేషన్‌ను నితీష్ కుమార్ ప్రభుత్వం జారీచేసింది. రజ్యాంగంలోని 14, 16, 20 అధికరణలను రాష్ట్ర ప్రభుత్వం తన గెజిట్ నోటిఫికేషన్ ద్వారా ఉల్లంఘించిందని, తాము చేసిన వాదనలపై విచారణ జరిపిన హైకోర్టు డివిజన్ బెంచ్ మార్చిలో తన తీర్పును రిజర్వ్ చేసిందని, ఈ రోజు తమ పిటిషన్లపై తీర్పును వెలువరించిందని పిటిషనర్ల తరఫు న్యాయవాదులలో ఒకరైన రితికా రాణి తెలిపారు. కుల గణన ఆధారంగా తాము రిజర్వేషన్ కోటాను పెంచినట్లు రాష్ట్ర ప్రభుత్వం వాదించిందని, అయితే ఇంద్రా సాహ్నీ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులతోపాటు ఇటీవల మరాఠాల రిజర్వేషన్లకు సంబంధించిన కేసులో 50 శాతం గరిష్ఠ పరిమితికి మించి ఏ రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లను పెంచడానికి వీల్లేదని సుప్రీంకోర్టు ఇటీవల స్పష్టం చేసిన విషయాన్ని తాము ఉటంకించామని మరో పిటిషనర్ తరఫు న్యయవాది నిర్భయ్ ప్రశాంత్ తెలిపారు. జనాభా గణాంకాల సేకరణలో భాగమైన ఎస్సి, ఎస్టిల జనాభా మినహాయించి మిగిలిన సామాజిక వర్గాల లెక్కలను సేకరించడంపై కేంద్రం నిస్సహాయతను వ్యక్తం చేసిన దరిమిలా బీహార్‌లో కులగణన నిర్వహిం చిన నితీష్ కుమార్ ప్రభుత్వం ఆ లెక్కల వివరాలను గత ఏడాది అక్టోబర్ 2న విడుదల చేసింది. ఈ సర్వే ప్రకారం రాష్ట్ర మొత్తం జనాభాలో ఓబిసిలు అత్యధికంగా 63 శాతం ఉండగాఎస్సి, ఎస్టిలను మొత్తం గా లెక్కగడితే 21 శాతానికి మించి ఉన్నారు. కాగా..కేంద్ర ప్రభుత్వం ఆర్థికంగా బలహీన వర్గాలకు(ఇడబ్లుస్) 10 శాతం కోటాను ప్రవేశపెట్టి రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని ఇదివరకే అతిక్రమించిందని బీహార్ ప్రభుత్వం అభిప్రాయం వ్యక్తం చేసింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఎస్సిలు, ఎస్టిలు, ఓబిసిలు, ఇబిసిల రిజర్వే షన్ కోటాను 50 శాతం నుంచి 65 శాతానికి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తన రిజర్వేషన్ చట్టాలను సవరించింది. ఇదబ్లుఎస్ కోటా 10 శాతాన్ని కూడా కలుపుకుంటే రాష్ట్రంలోని మొత్తం జనాభాలో 75 శాతం మందికి రిజర్వేషన్ కోటా వర్తిస్తోంది. తాము సవరించిన రిజర్వేషన్ చట్టాలను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో పొందుపరచాలని కూడా కేంద్రాన్ని బీహార్ ప్రభుత్వం కోరింది. రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో ఉండే కేంద్ర, రాష్ట్ర చట్టాలను కోర్టులలో సవాలు చేసేందుకు అవకాశం ఉండదు. రిజర్వేషన్ కోటాపై 50 శాతం గరిష్ఠ పరిమితి విధిస్తూ సుప్రీంకోర్టు 1992లో ఉత్తర్వులు జారీచేసింది. కాగా..బీహార్‌లో నితీష్ కుమార్ సారథ్యంలోని జెడియుతో అధికారాన్ని పంచుకున్న సమయంలో వచ్చిన ఈ కోటా చట్టాల సవరణను స్ఫూర్తిగా తీసుకున్న కాంగ్రెస్ పార్టీ తాము కేంద్రంలో అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా కులగణన నిర్వహిస్తామని తన లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో వాగ్దానం చేసింది. అయితే ప్రస్తుతం బీహార్‌లో నితీష్ కుమార్‌తో కలసి అధికారాన్ని పంచుకుంటున్న బిజెపి కూడా రిజర్వేషన్ కోటాల సవరణ విషయంలో తమ పాత్ర కూడా ఉందని వాదిస్తోంది. 2022లో అధికార కూటమిలో తాము భాగస్వామిగా ఉన్న కాలంలోనే కుల గణనకు ఆదేశాలు జారీ అయినట్లు చెబుతోంది.

# భద్రాద్రిలో శ్రీరామకల్యాణమా? లక్ష్మీనారాయణుల కల్యాణమా?

ఖమ్మం,: రాముడా? నారాయణుడా? దశాబ్ద కాలంగా రాములోరి క్షేత్రం భద్రాచలంలో ఇదే చర్చ జరుగుతోంది. తెగని వివాదంపై హైకోర్టును ఆశ్రయించారు రామ భక్తులు. కోర్టు వేసిన ఐదుగురి సభ్యుల కమిటీ రెండు రోజుల పాటు అర్చకులు, పండితుల అభిప్రాయాలు సేకరిస్తోంది. తర్వాత కోర్టుకు రిపోర్టు సమర్పించనుంది. ఇంతకీ భద్రాద్రిలో ఈ పంచాయితీ ఎందుకు?దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచలం క్షేత్రంలో దశాబ్దకాలంగా రామనారాయణపై వివాదం కొనసాగుతోంది. సీతారామచంద్రస్వామి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల తరుణంలో చర్చ తెరమీదకు వస్తుంది. భద్రాద్రిలో జరిగేది శ్రీరామకల్యాణమా లేక లక్ష్మీనారాయణుల కల్యాణమా అంటూ కొంతమంది ప్రశ్నిస్తుండటం చర్చకు దారి తీస్తోంది. దశాబ్ద కాలంలో ఎన్నోసార్లు ఈ విషయం శ్రీరామనవమి ముందు తెరపైకి రావటం, తర్వాత తెరమరుగు కావటం ఏటా జరుగుతోంది. ఈ క్రమంలో ప్రభుత్వమే ఈ విషయంపై జోక్యం చేసుకోవాలని ఆధ్యాత్మికవేత్తలు, పీఠాధిపతులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం దొరకలేదు. దీంతో కొంతమంది భక్తులు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఐదుగురి సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ సభ్యులు భద్రాచలం సీతారామ చంద్రస్వామి దేవాలయంలో రెండు రోజుల పాటు విచారణ చేపట్టారు. రామనారాయణ అంశం ఆలయ వైదికులకు, భక్తులకు ఎన్నో సవాళ్లు విసురుతోంది. భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయంలో నిర్వహించే కల్యాణోత్సవంలో రామనారాయణ అనే మాటను వైదిక బృందం ఉపయోగిస్తోంది. కొన్ని వర్గాలు దీన్ని తప్పు పడుతున్నాయి. కొన్నేళ్లుగా ఈ వివాదాల తాకిడి రాజుకుంటూనే ఉండగా తమదే సరైన పద్ధతి అని ఇరుపక్షాలు చెప్పుకుంటున్నాయి. గతంలో పలు సంచలన విషయాలను ప్రస్తావిస్తూ గుంటూరు జిల్లా ఆరేపల్లి అగ్రహారానికి చెందిన డా. అన్నదానం చిదంబరశాస్త్రి రాసిన భద్రాద్రీశునకు జరుగుతున్న ఘోరాపచారం అనే పుస్తకం దుమారాన్నే రేపింది. రామాలయ సిబ్బంది ఈ పుస్తకంలోని అంశాలను ఖండించారుతెలంగాణ రాముడి వైభవం తగ్గించేందుకు జరుగుతున్న కుట్రలో భాగంగానే రామనారాయణ వివాదాన్ని తెరమీదకు తీసుకొస్తున్నారనే వాదన ఉంది. గతంలో ఎన్నో చర్చా వేదికల్లో కూడా వివరించి ప్రభుత్వానికి కూడా నివేదిక సమర్పించామని మాజీ ప్రధానార్చకులు కోటి కృష్ణమాచార్యులు చెబుతున్నారు. ప్రతి ఆలయానికి కొన్ని సంప్రదాయాలు, ఆచారాలు ఉంటాయని.. లేనిపోని అంశాల తెరమీదకు తేవొద్దంటున్నారు. ఆలయ సంప్రదాయ అంశంపై 1999 నుంచే కొంతమంది కుట్రలు చేసి వివిధ కార్యక్రమాలు నిర్వహించుకుంటూ వచ్చారని పలువురు అర్చకులు అంటున్నారు. స్వామివారి కల్యాణం వైష్ణవ సంప్రదాయం ప్రకారం జరుగుతుందని నాటి కమిషనర్‌కు వివరించామని చెబుతున్నారు. 2000 సంవత్సరంలో కల్యాణం గురించి అసెంబ్లీలో కూడా చర్చకు వచ్చిందని, భద్రాచలం అర్చకులు పాటిస్తున్న సంప్రదాయాలే కొనసాగుతాయని హైకోర్టు కూడా గతంలో స్పష్టం చేసిందని గుర్తుచేస్తున్నారు. ఆ తీర్పుతో భంగపడ్డ కొందరు అప్పటినుంచి కుట్రలకు తెరలేపారని మండిపడుతున్నారు. భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో.. రాముడా రామ నారాయణుడా అనేదానిపై దశాబ్ద కాలానికిపైగా కొనసాగుతోన్న వివాదం ఇప్పటికైనా కొలిక్కి వస్తుందా అన్న చర్చ ఉంది. హైకోర్టు కమిటీ వైదిక సిబ్బంది, వేద పండితుల అభిప్రాయ సేకరణతో పాటు వివాదానికి కారణాలను వీడియో రికార్డు ద్వారా సేకరిస్తుంది. తర్వాత కమిటీ సభ్యులు రాముడా.. రామనారాయణుడా అనే అంశంపై స్పష్టత కోసం వీడియోలు, అభిప్రాయాలను కోర్టుకు సమర్పించనున్నారు. దీనిపై ఫైనల్‌గా హైకోర్టు తీర్పు ఇచ్చే అవకాశం ఉంది.

# సింగరేణిని కాపాడుకుంటాం...

హైదరాబాద్: తెలంగాణ ప్రాంతానికే తలమానికమైన సింగరేణిని కాపాడుకోవడానికి అవసరమైతే ప్రధాని నరేంద్రమోదీని కలుస్తామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. సింగరేణి బంద్ అయితే వేలాది మంది తమ ఉద్యోగాలు పోగొట్టుకుని రోడ్డున పడతారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. శ్రావణపల్లి బొగ్గు గనులను కేంద్రం వేలం వేస్తోందని ఈ విషయం గురించి కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని కలుస్తామని తెలిపారు. ఖమ్మంలో గురువారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సింగరేణి, బొగ్గు గనులపై బీఆర్ఎస్ నేతల తీరు దొంగే దొంగ అన్నట్లు ఉందన్నారు. గనుల వేలం సమయంలో బీఆర్ఎస్, బీజేపీ నేతల వ్యాఖ్యలు రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తున్నాయంటూ మండిపడ్డారు. సింగరేణి సంస్థలో 42 వేల మంది రెగ్యూలర్, 26 వేల మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారని భట్టి పేర్కొన్నారు. ప్రస్తుతం సంస్థ ద్వారా 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరుగుతోందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సింగరేణి తన ప్రాభవాన్ని కోల్పోయిందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీని కలిసి తెలంగాణ ఆస్తులను కాపాడాలని విజ్ఞప్తి చేస్తామని మంత్రి అన్నారు. రాష్ట్రంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీల వారిని కలుపుకుని ప్రధాని మోదీని కలుస్తామన్నారు. కొన్ని రోజులుగా రాష్ట్రంలో ఉన్న బొగ్గు గనులను కేంద్ర ప్రభుత్వం వేలం వేసే ప్రక్రియ మొదలు పెడుతుందని చెప్పారు. రేపు హైదరాబాద్ లో ఆక్షన్ జరగబోతుందన్నారు. ఏనాడు సింగరేణి ఉద్యోగులను పట్టించుకోని బీఆర్ఎస్ ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తుందంటూ ఆరోపించారు. బీఆర్ఎస్, బీజేపీ నేతల మాటలు రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తున్నాయన్నారు. 40 బొగ్గు గనుల్లో ప్రస్తుతం బొగ్గు ఉత్పత్తి జరుగుతుంది. ఇప్పుడు ఉత్పత్తి అవుతున్న 70 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి 2026కి పూర్తిగా పడిపోతుంది. 2031-32 వరకు బొగ్గు ఉత్పత్తి సామర్థ్యాన్ని సింగరేణి నిలబెట్టుకోవాలన్నా.. ఉద్యోగుల మనుగడ కొనసాగాలన్నా కేంద్రం నిర్వహించే గనుల ఆక్షన్ లో సింగరేణి యాజమాన్యం తప్పనిసరిగా కొత్త బొగ్గు గనులను సొంతం చేసుకోవాల్సిందేనన్నారు. లేని పక్షంలో సింగరేణి సంస్థ చరిత్రలో కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్న కోల్ బ్లాక్స్ అన్నింటిని కూడా ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి ఇస్తే బాగుండేదన్నారు మంత్రి భట్టి విక్రమార్క. 2015లో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మైన్స్ అండ్ మినరల్స్ డెవెలప్‌మెండ్ రెగ్యూలేషన్ యాక్ట్-1957 యాక్ట్‌లో సవరణ తీసుకొచ్చింది. దీని ద్వారా దేశంలో ఉన్న బొగ్గు గనులను ప్రభుత్వ రంగ సంస్థకు నేరుగా ఇవ్వకుండా.. వేలం ద్వారా ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టేందుకు కుట్ర చేసిందని మంత్రి ఆరోపించారు. మైన్స్ అండ్ మినరల్స్ డెవెలప్‌మెండ్ రెగ్యూలేషన్ యాక్ట్-1957 యాక్ట్‌లో సవరణ బిల్లుకు పార్లమెంటులో ఆనాడు బీఆర్ఎస్ కూడా మద్దతు ఇచ్చిందంటూ గుర్తు చేశారు. కేంద్రం పెట్టిన బిల్లుకు సంపూర్ణ మద్దతు ఇచ్చిన బీఆర్ఎస్ పదేళ్లు సింగరేణిని కాపాడమంటున్నారు. తెలంగాణ మీద ప్రేమ ఉన్నట్లు బీజేపీ మంత్రులు మాట్లాడుతున్నారు. సింగరేణి సంస్థను కాపాడుకునేందుకు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డిని కలుస్తామన్నారు

# కమలం గూటికి గంగుల..?

కరీంనగర్. సోషల్ మీడియాలో చేసిన ఒక్క పోస్టుతో ఆ మాజీ మంత్రి పార్టీ మారబోతున్నారు అంటూ రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీస్తున్నాయి. మారడం లేదని క్లారిటీ ఇచ్చినప్పటికీ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా నియమితులైన బండి సంజయ్ ని అభినందిస్తూ చేసిన పోస్టు ఆ అనుమానాలకు మరింత బలం చేకూరుస్తోంది. ఆ పోస్ట్ చూసిన కొంతమంది ఆయన బీజేపీలో చేరడం ఖాయం అంటూండగా మరి కొంతమంది మాత్రం సీఎం రేవంత్ రెడ్డితో ఉన్న సంబంధాలతో కాంగ్రెస్ లో చేరతానని అంటున్నారు. మరి ఆ ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీకి గుడ్ బై చెప్తారా? లేదా? అనేది రాజకీయ వర్గాలలో హాట్ టాపిక్ గా మారింది. కరీంనగర్ ప్రస్తుత ఎమ్మెల్యే మాజీమంత్రి గంగుల కమలాకర్ పార్టీ మారతారని చర్చలు రాజకీయ వర్గాలలో జోరందుకుంటున్నాయి. కరీంనగర్ లో వరుస విజయాలు నమోదు చేసుకొని రికార్డ్ క్రియేట్ చేసుకున్నారు గంగుల కమలాకర్. కౌన్సిలర్ గా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన గంగుల 2009లో టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2014 తర్వాత ఉద్యమ పార్టీగా ఉన్న టీఆర్ఎస్ లో చేరారు. వరుసగా నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. టీఆర్ఎస్ హయాంలో కీలక శాఖలకు మంత్రిగా చేశారు. దశాబ్ద కాలంగా కారు పార్టీలోనే జర్నీ చేస్తున్నారు. ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీ పరిస్థితి అగమ్య గోచరంగా తయారు కావడంతో తిరిగి పార్టీ మారతారంటూ పుకార్లు షికార్లు చేస్తున్నాయి. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు తాను వీర విధేయుడ్ని అంటూ చెప్పుకుంటారు. అలాంటిది గంగుల కమలాకర్ పార్టీ మారతారని ప్రచారం జరుగుతుండడంతో క్యాడర్ లో గందరగోళం నెలకొంది. ఇక బిజెపి ఎంపీ బండి సంజయ్.. కంగుల కమలాకర్ ఇద్దరు ఉప్పునిప్పులా ఉంటారు. ఇద్దరి మధ్య చాలా అంశాలలో మాటల యుద్ధం తారస్థాయికి చేరుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. సంజయ్ కి కేంద్ర హోంశాఖలో సహాయ మంత్రిగా పదవి దక్కడంతో సోషల్ మీడియా వేదికగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్ శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ మారతారనే ప్రచారాలు ఎవరికి తోచినట్టు వారు అనువదించుకుంటున్నారు. గంగుల మాత్రం నో కామెంట్స్ అన్నట్టుగా మౌనం పాటిస్తున్నారు. మరోవైపు సీఎం రేవంత్ రెడ్డి గంగులకు సన్నిహితంగా సంబంధాలు ఉన్నాయి తెలుగుదేశం పార్టీలో ఇద్దరు కలిసి పని చేశారు. తర్వాత చోటు చేసుకున్న రాజకీయ పరిణామాలతో చెరో గూటికి చేరుకున్నారు. సీఎం అయిన తర్వాత గంగుల కమలాకర్ హస్తం గూటికి చేరుతారు అనే ప్రచారం కూడా జోరుగానే జరిగింది. మంత్రి పొన్నం ప్రభాకర్ గంగుల కమలాకర్ కు అడ్డు చెప్పినట్టుగా మరో టాక్ వినిపించింది. అయితే జరుగుతున్న ప్రచారం నేపథ్యంలో ఇటీవల కరీంనగర్ పర్యటనలో గంగుల కమలాకర్ ఇంటికి వెళ్లిన కేసీఆర్, కేటీఆర్ పార్టీ మారకుండా నచ్చ చెప్పారని సమాచారం. కమలాకర్ కూడా పార్టీ మారనని స్పష్టత ఇవ్వడంతో కొన్ని రోజులపాటు జరుగుతున్న ప్రచారానికి తెర వేసినట్టు అయ్యింది. అయితే ఈ మధ్యకాలంలో బీజేపీకి అధిక పార్లమెంట్ సీట్లు రావడం.. గంగుల కమలాకర్ సోషల్ మీడియా వేదికగా బండి సంజయ్ కి శుభాకాంక్షలు తెలపడం రాజకీయ వర్గాలలో కొంతవరకు చర్చనీయాంశంగా మారింది.

# ఎడారిగా శ్రీరామ్ సాగర్

నిజామాబాద్: ఉత్తర తెలంగాణ వరప్రదాయని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీరు లేక వెలవెలబోతోంది. నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ ఉమ్మడి జిల్లాల పరిధిలోని సుమారు 12 లక్షల ఎకరాలకు తాగు, సాగునీరు అందించేందుకు నిర్మించిన ఈ ప్రాజెక్టు పూర్తి నిల్వ సామర్థ్యం 91 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 8 టీఎంసీలు మాత్రమే నీరుంది. దీంతో ప్రాజెక్టు డెడ్ స్టోరేజ్ కి పడిపోయింది. వర్షాకాలం ప్రారంభమై మూడు వారాలు గడుస్తున్నా.. వరుణుడి కరుణ లేకపోవటంతో ఇప్పటివరకు కేవలం 1 టీఎంసీ నీరుమాత్రమే చేరింది. అటు ప్రాజెక్టు ఎగువన గల గోదావరి పరివాహ ప్రాంతంలో సైతం వర్షాలు లేకపోవడంతో గోదావరిలోకి ఇన్‌ఫ్లో లేకపోవటం, ఇటు ఖరీఫ్ సీజన్ మొదలు కావటంతో రైతన్నల్లో ఆందోళన మొదలైంది. ఎస్సారెస్పీ ఎగువన మహారాష్ట్ర నిర్మించిన బాబ్లీ, విష్ణుపురి ప్రాజెక్టుల పరిస్థితీ ఇదే. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం బాబ్లీ గేట్లు జూలై 1న ఎత్తాలి. కానీ, ఆ ప్రాజెక్టు ఖాళీ కుండలా ఉండటంతో గేట్లు ఎత్తినా ప్రయోజనం లేదు. ఇక.. ఎస్సారెస్పీకి ఎగువ ప్రాంతంలోని విష్ణుపురి ప్రాజెక్ట్ నుంచే ప్రస్తుతం కొద్దికొద్దిగా నీరు చేరుతోంది. మరోవైపు.. ఎస్సారెస్పీకి పూర్వ వైభవం తెచ్చేందుకు గత ప్రభుత్వం రూ. 1067 కోట్ల నిధులతో పునరుజ్జీవన పథకం పనులు ప్రారంభించి, గత జులైలో కాళేశ్వరం నుంచి 25 టీఎంసీల నీటిని తరలించారు. కానీ, ఇప్పుడు కాళేశ్వరం ప్రాజెక్ట్ పరిస్థితి గందరగోళంగా మారటంతో ఈ ఏడాది తమ ఖరీఫ్ పంట ఏమవతుందనే ఆందోళన రైతుల్లో నెలకొంది. పదేళ్లలో 2016, 2018లో మాత్రమే సమయానికి వరదనీరు వచ్చి చేరింది. 2016లో జూలై నాటికే ప్రాజెక్ట్ నిండుకుండలా మారగా, వరద గేట్లు ఎత్తి గోదావరిలోకి నీటిని వదిలాల్సి వచ్చింది.

2018లోనూ ముందస్తు వరదలు వచ్చినా తర్వాత వానలు లేక.. ప్రాజెక్టు నిండలేదు. 2023లో సకాలంలో వరద నీరు భారీగా రావటంతో జూలైలో ప్రాజెక్ట్ నిండింది. మిగిలిన సంవత్సరాల్లో ఎప్పుడూ ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లోనే వరదలు వచ్చి ప్రాజెక్టుకు వరదనీరు వచ్చింది. దీంతో ఆయా సంవత్సరాల్లో అధికారులు.. ఖరీఫ్‌కు నీటి విడుదల చేపట్టకుండా రబీ సీజన్ నాటికి కాస్త ముందుగా నీటిని విడుదల చేశారు. ప్రస్తుత పరిస్థితులు నేపథ్యంలో ఏ ఏడాదీ అదే పరిస్థితి వచ్చే అవకాశముందని నీటిపారుదల శాఖ భావించగా, వరుణుడు దయ తలిస్తే వారంలోనే ఈ పరిస్థితి మారి, తమకు ఖరీఫ్ పంట కూడా దక్కుతుందని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. 112 టీఎంసీల పూర్తి సామర్థ్యం గల ఈ ప్రాజెక్టులో నిర్మించిన నాటి నుంచి పూడిక పేరుకుంటూ వచ్చింది. దీంతో ప్రాజెక్టు సామర్థ్యం ప్రస్తుతం 90 టీఎంసీలని చెబుతున్నప్పటికీ, నిజానికి అంతకంటే తక్కువగానే ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను లొంగదీసుకునే ప్రయత్నం చేస్తున్నారు

సంగారెడ్డి: పటాన్ చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సోదరుల ఇండ్లలో ఈడీ దాడులపై సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు స్పందించారు.

అయన మహిపాల్ రెడ్డిని పరామర్శించారు హరీశ్ రావు మాట్లాడుతూ అధికారంలో ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిపక్ష ఎమ్మెల్యేలను ఈడీ,ఐటీ దాడులతో వేధిస్తున్నారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఇంట్లో ఏలాంటి అవినీతి ఆస్తులు దొరకలేదు. బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను భయపెట్టి లొంగదీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. బీహార్, గుజరాత్ లలో నీట్ ప్రశ్నాపత్రాలను అమ్ముకున్నారు. ప్రశ్నాపత్రాలు లీకవుతున్నా అధికారులు ఎందుకు వారిపై దాడులు చేయటం లేదు. మన రాష్ట్రంలో లక్ష కుటుంబాలు నీట్ పరీక్ష వ్రాశారు, వారిభవిష్యత్తు అయోమయంలో ఉంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఒత్తిడికి గురిచేస్తుంది. బిఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇళ్లు చుట్టూ తిరుగుతూ.. అధికారపార్టీ బెదిరింపు ధోరణికి పాల్పడుతున్నారు. ఇంట్లో చిన్న పిల్లలు ఏడుస్తున్నా కర్కశంగా ఎమ్మెల్యే ఇంట్లో ఈడీ దాడులు చేయటం దారుణమని అన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన కలెక్టర్

## శానిటేషన్ నిర్వహణపై అసంతృప్తి చెందిన కలెక్టర్

జగిత్యాల: రోగులకు అందుతున్న వైద్య సేవలు పరిశీలించడానికి ఆసుపత్రి సందర్శన చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని పలు వార్డులను ఆయన సందర్శించి వైద్యులకు పలు సూచనలు అందించారు. ఆసుపత్రిలోని ఎమర్జెన్సీ వార్డు, ఐ.సి.యు. , ఆపరేషన్ థియేటర్, మేల్, ఫిమేల్ వార్డులు, సిటీ స్కాన్, స్కానింగ్ రూమ్, ఎక్స్-రే, క్యాన్సర్ రోగుల చికిత్స కేంద్రాన్ని, వయో వృద్ధుల ఫిజియో థెరపీ సేవ కేంద్రంలను కలెక్టర్ పరిశీలించారు. ఆయా వార్డులలోని రోగులతో ముచ్చటిస్తూ అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి ప్రాంగణంలో ప్రైవేట్ జీవనాధార మందుల దుకాణం ఏర్పాటుపై వైద్యులను అడిగి తెలుసుకుని వెంటనే తోలగించాలని సూచించారు. ఆసుపత్రిలో శానిటేషన్ నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ రేపటిలోగా చెత్త చెదారాన్ని, పనికిరాని స్క్రాప్ ను తొలగించాలని శానిటేషన్ ఇంచార్జిని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ రాములు, ఆర్.ఎం.ఓ. రాజేంద్ర ప్రసాద్, వైద్యులు, వైద్య సిబ్బంది ఉన్నారు.

# డైలామాలో కేటీఆర్ ఫ్యూచర్

హైదరాబాద్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫ్యూచర్ డైలమాలో పడింది. అసెంబ్లీ ఎన్నికలు, లోక్‌సభ ఎన్నికల్లో అన్నీ తానై వ్యవహరించిన గులాబీపార్టీ చిన్నబాస్ లోక్‌సభ ఫలితాల తర్వాత పత్తా లేకుండా పోయారు. అసలే సీఎం సీటు దిగాల్సి వచ్చిందన్న బెంగతో కేసీఆర్ ఫాంహౌస్ నుంచి బయటకు రావడం లేదు. ఇటు చూస్తే ఒక్క ఎంపీ స్థానం కూడా దక్కకపోవడంతో కేటీఆర్ పార్టీ శ్రేణులకు నల్లపూస అయిపోయారు. తీహార్ జైలుకు వెళ్లి చెల్లిన చూసొచ్చిన వెంటనే ఆయనకు ఎన్నికల అఫిడవిట్ ఉచ్చు బిగుసుకుంది. ఆ క్రమంలో ఆయన పోస్టుపై పార్టీలో పెద్ద చర్చే జరుగుతుంది. వరుస ఓటములతో బీఆర్ఎస్ ఉక్కిరి బిక్కిరి అవుతుంది. మరోవైపు వలసలు గులాబీ పెద్దలకు షాక్‌ల షాక్‌లు ఇస్తున్నాయి. దాంతో పార్టీ మనుగడే ప్రశ్నార్థకంగా తయారైంది. ఇలాంటి పరిస్థితుల్లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లోక్‌సభ ఎన్నికల్లో ఓటమిపై సమీక్షలు నిర్వహించి.. పార్టీ శ్రేణుల్లో స్థైర్యం నింపాల్సిన భాధ్యత కేటీఆర్‌దే. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో కేటీఆరే ఎక్కువ హడావుడి చేశారు. అసెంబ్లీ ఎన్నికలప్పుడైతే కేసీఆర్ ఢిల్లీ పాలిటిక్స్ చూసుకుంటారు. తానే సీఎం అన్న రేంజ్లో బిల్డప్ ఇచ్చారు. తన వర్గం ఎమ్మెల్యేలతో సీఎం, సీఎం అని నినాదాలు కూడా చేయించుకున్నారు. అయితే ఆ కల్వకుంట్ల దొరలు కన్న కలలు ఒక్కటి కూడా నెరవేరలేదు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో వరుస పరాభవాలతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కీలక నేతలు పార్టీకి గుడ్‌బై చెపుతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన బైపోల్స్‌లో కూడా కారు టైర్లు పేలిపోయాయి. ఆ దెబ్బతో ఇప్పటికే కొంతమంది బీఆర్ఎస్ నాయకులు పలువురు కాంగ్రెస్‌లోకి వెళ్లిపోయారు. మరికొందరు కాంగ్రెస్ లేదా బీజేపీలోకి వెళ్లాలని చూస్తున్నారు. ఇలాంటి కష్టకాలంలో యాక్టివ్‌గా ఉంటూ పార్టీ నాయకులను మరోపార్టీకి వెళ్లిపోకుండా ఆపాల్సిన కేటీఆర్ సైలెంట్ గా ఉండటం ఏమిటన్న



విమర్శలు వస్తున్నాయి. అసలు ఆయన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా క్యాపబులేనా? అన్న అనుమానాలు పార్టీ వర్గాల్లోనే వ్యక్తమవుతున్నాయి. ఆయన్ని ఆ పోస్టు నుంచి దించాలని డిమాండ్లు కూడా మొదలయ్యాయి. లోక్‌సభ ఎన్నికల్లో సత్తాచాటుతామని బీరాలు పలికిన ఆయన.. ఇప్పుడు అవమాన భారంతో బయటకు రావడం లేదని ప్రత్యర్థి పార్టీలు విమర్శిస్తున్నాయి. మరోవైపు ఎన్నికల అఫిడవిట్‌పై కోర్టు విచారణ , ఫోన్ ట్యాపింగ్ కేసు, గొర్రెల స్కామ్, కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి, విద్యుత్ కొనుగోళ్లలో అవకతవకలు, ఇలా బీఆర్ఎస్‌లోని పెద్ద తలకాయల చుట్టూ గట్టిగానే ఉచ్చు బిగుస్తోంది. ఈ పరిస్థితుల్లో కేటీఆర్‌కు పార్టీని హ్యాండిల్ చేసే సినిమా లేదని.. వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టు తీసి మళ్లీ ఫారిన్ పంపించేస్తే బెటర్ అన్న సూచనలు కూడా వస్తున్నాయంట. ఎంత కాదన్న రెండు టర్మ్‌లు సీఎంగా పనిచేసిన కేసీఆర్ పార్టీని వదులుకోలేరు. కొడుకు కేటీఆర్ యాక్టివ్ రోల్ పోషించిన లోక్‌సభ ఎన్నికల్లో సొంత జిల్లా మెదక్ లోనూ బీఆర్ఎస్ కు కలిసి రాలేదు. ఇక రేపోమాపో స్థానిక సంస్థల ఎన్నికలు రానున్నాయి. ఇటు చూస్తే పార్టీ కేడర్ పూర్తిగా నిరుత్సాహంలో ఉంది. దాంతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి మార్పు పైన కేసీఆర్ ఆలోచన చేస్తున్నారంట. ట్రాక్ తప్పిన పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసి ఎలాగోలా గాడిలో పెట్టడానికి కేసీఆర్ కసరత్తు చేస్తున్నారు. అందులో భాగంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను పార్టీలో కీలక బాధ్యతల నుంచి తప్పించాలని భావిస్తున్నారంట. కేటీఆర్ స్థానంలో కుటుంబంలోనే మరొకరికి కేటాయించాలా లేదా బయట వ్యక్తులకు ఆ పదవి కట్టబెట్టాలా అనేదానిపై కేసీఆర్ సమాలోచనలు కొనసాగిస్తున్నారంటున్నారు. ఆ క్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టు రేసులో హరీష్‌రావు పేరు ఫోకస్ అవుతుంది. హరీష్ కు అప్పగించినా కుటుంబ సభ్యులకే మరోసారి పదవి ఇచ్చారనే విమర్శలు ఎదురయ్యే ఛాన్స్ ఉంది. దీంతో హరీష్ తో పాటుగా ఎస్సీ, బీసీ సామాజికవర్గాల నుంచి ఎవరినైనా రెండో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎంపిక చేయాలని చూస్తున్నారంట. తెలంగాణ వచ్చినప్పుడు దళితుడ్ని ముఖ్యమంత్రి చేస్తానని ఎన్నికల ప్రచారంలో ఘనంగా ప్రకటించారాయన. గెలవగానే ఆ విషయం మర్చిపోయారు. ఇప్పుడు రెండో వర్కింగ్ ప్రెసిడెంట్ పదవైనా ఆ వర్గానికి కేటాయించాలని లీడర్ని వెతుక్కుంటున్నారంట. మొత్తానికి అలా సాగిపోతోంది కారు పార్టీ ప్రయాణం.

కేటీఆర్ నోటీసులు

బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ కు రాష్ట్ర హైకోర్టు నోటీసులు జారీ చేసింది. నామినేషన్ సందర్భంగా కేటీఆర్ సమర్పించినటువంటి ఎన్నికల అఫిడవిట్లలో తప్పుడు ప్రచారం ఉందంటూ కాంగ్రెస్ నేత కేకే మహేందర్ రెడ్డి, లగిశెట్టి శ్రీనివాసులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ పై విచారణ చేపట్టిన న్యాయమూర్తి జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు.. నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని కేటీఆర్ తోపాటు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి, సిరిసిల్ల రిటర్నింగ్ ఆఫీసర్ కు నోటీసులు జారీ చేశారు. తదుపరి విచారణను హైకోర్టు వాయిదా వేసింది.

## రీజనల్ రింగ్ రోడ్డు వద్దంటూ..





### - భూ నిర్వాసిత రైతుల ఆందోళన

రాయపోల్: ”రీజనల్ రింగ్ రోడ్డు వద్దు.. మా భూములు మాకు కావాలి.. లేదా రోడ్డు అలైన్‌మెంట్ అయినా మార్చాలి” అంటూ రీజనల్ రింగ్ రోడ్డు భూ నిర్వాసిత రైతులు ఆందోళన చేపట్టారు. ఆదివారం సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం ఎల్కల్ గ్రామంలో ఆర్ఆర్ఆర్ భూ నిర్వాసితుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా చైతన్య వేదిక కన్వీనర్ చీమల జగదీష్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపడుతున్న రీజనల్ రింగ్ రోడ్డు బేగంపేట, ఎల్కల్ గ్రామాల గుండా వెళ్తుందని ఆ రోడ్డు వద్దని, భూములే కావాలని, వాటిని నమ్ముకునే జీవనం సాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు వల్ల భూమిని కోల్పోతే బతుకుదెరువు కష్టమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేపట్టిన సర్వేలో రోడ్డు మార్గం అలైన్‌మెంట్ మార్చాలన్నారు. అదీ కుదరకపోతే 2013 భూ చట్టం ప్రకారం భూమికి భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రస్తుత మార్కెట్ విలువ కన్నా రెండింతలు అదనంగా నష్టపరిహారం చెల్లించాలని కోరారు. రాయపోల్ మండలంలోని ఎల్కల్, బేగంపేట్ గ్రామాల రైతులకు వ్యవసాయమే జీవనాధారమని, భూములు కోల్పోతే బతుకుదెరువు లేదన్నారు. గతంలో పలుమార్లు రెవెన్యూ అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు సురేష్ కుమార్, ఎల్కల్ బేగంపేట గ్రామాల రైతులు కుమార్, పిట్ల స్వామి, జాల రాజయ్య, మల్లేశం, శ్రీశైలం, బర్కం మల్లేష్, స్వామి, రమేష్, చిన్న మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ లో ఉండేది ఎవరు...?

వరంగల్: శాసన మండలిలో తమ సభ్యులను కాపాడుకునేందుకు బీఆర్ఎస్ పార్టీ అలర్ట్ అయింది. శాసనమండలిలో మొత్తం 40మంది సభ్యులుండగా వీరిలో 29మంది బీఆర్ఎస్ పార్టీవారే. కాంగ్రెస్‌కు కేవలం నలుగురు ఎమ్మెల్సీలే ఉన్నారు. ఇప్పుడు హస్తం పార్టీ ఆపరేషన్ ఆకర్ష్ స్టార్ట్ కావడంతో గులాబీపార్టీలో గుబులు మొదలైంది. త్వరలో శాసనసభ బడ్జెట్ సమావేశాలు ఉన్నందున ఎలాగైనా గులాబీదళం బలం తగ్గించాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ గట్టి కసరత్తు చేస్తోంది. శాసనమండలిలో పలు కీలక బిల్లుల ఆమోదానికి బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు అడ్డుపడే అవకాశం ఉన్నందున కాంగ్రెస్ వారికి గాలం వేస్తోంది. ఇప్పటికే కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో టచ్‌లో ఉన్నట్టు సమాచారం. వీరు పార్టీని వీడి కాంగ్రెస్‌తో జతకట్టేందుకు సిద్ధమయ్యారనే టాక్ వినిపిస్తోంది. దీంతో బీఆర్ఎస్ అధిష్ఠానం అలర్ట్ అయింది. ఎవరెవరు పార్టీమారే అవకాశం ఉందో ఆరా తీస్తోంది. ఎమ్మెల్సీలకు సన్నిహితంగా ఉండేవారి నుంచి వివరాలు సేకరిస్తుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తమపార్టీతో చేరితే పదవులు,నిధులు ఇస్తామని కాంగ్రెస్ హామీలు ఇస్తున్నట్టు సమాచారం. బీఆర్ఎస్ రాజకీయ భవిష్యత్తు ఇచ్చినప్పటికీ మరో కొంతకాలం పదవి ఉండాలంటే పార్టీ మారడం శ్రేయస్కరమని కొందరు ఎమ్మెల్సీలు భావిస్తున్నట్టు టాక్. అందులో భాగంగానే కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునేందుకు పలువురు సిద్ధమవుతున్నట్టు తెలిసింది. కొందరికి పార్టీ అధినేత కేసీఆర్ ఫోన్ చేస్తే వారినుంచి సరైన సమాధానం రాలేదని.. అలాగని పార్టీలో కొనసాగుతామని కూడా చెప్పలేదు. దీంతో 29మంది బీఆర్ఎస్ ఎమ్మెల్సీలలో కనీసం 10మందైనా మిగులుతారా అనే సందేహం కారుపార్టీని తొలిచేస్తోంది. వరంగల్ జిల్లా నుంచి ఎమ్మెల్సీలుగా ఉన్న ఆరుగురు బీఆర్ఎస్ నేతలు కేసీఆర్‌కు అత్యంత సన్నిహితులుగా పేరుగాంచారు. అయితే మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో తమ భవిష్యత్తుకోసం పార్టీ మారేందుకు వీరు సిద్ధమవు తున్నట్టు సమాచారం. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత బీఆర్ఎస్ తీరును, టికెట్ల కేటాయింపును వరంగల్ జిల్లాకు చెందిన ఒక ఎమ్మెల్సీ బహిరంగంగానే తప్పుబట్టారు. ఆయన నియోజకవర్గం ప్రస్తుతం కాంగ్రెస్ కంచుకోటగా మారడంతో పార్టీమారాలని అనుచరగణం ఒత్తిడి చేస్తోంది. మరో ఎమ్మెల్సీపై కూడా అనుచరులు పార్టీ మారాలని ఇలాగే ఒత్తిడి చేస్తున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్‌లోకి వస్తే రాజకీయ భవిష్యత్తు ఉంటుందని రేవంత్‌కు సన్నిహితుడైన ఎమ్మెల్యే ఒకరు ఆ ఎమ్మెల్సీకి చెప్పినట్టు తెలిసింది. ఈ జిల్లాకు చెందిన మరో ఎమ్మెల్సీకి కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు మంత్రులతో అత్యంత సన్నిహిత సంబంధాలు ఉండడంతో ఆయన కూడా కాంగ్రెస్‌లోకి జంప్ చేసే అవకాశాలున్నట్టు ప్రచారం జరుగుతోంది.



**విస్తరణలో ఐదుగురికి చోటు**

స్థానిక సంస్థల ఎన్నికల వేళ కేబినెట్ విస్తరణ దృష్టి సారించారు సీఎం రేవంత్‌రెడ్డి. ఈ వ్యవహారంపై ఇప్పటికే కాంగ్రెస్ హైకమాండ్‌తో మంతనాలు జరిపారు. దాదాపు గ్రీన్ సిగ్నల్ వచ్చినట్టు అంతర్గత సమాచారం. తెలంగాణలోని ముఖ్యనేతలు ఇప్పటికే కాంగ్రెస్ పెద్దలతో తమకున్న సంబందాల ద్వారా లాబీయింగ్ మొదలుపెట్టారు. అంతా అనుకున్నట్లు జరిగితే జులై మొదటివారంలో కేబినెట్ విస్తరణ ఉంచవచ్చని అంటున్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రితోపాటు 12 మంది మంత్రివర్గంలో ఉన్నారు. మరో ఐదారుగురు ఛాన్స్ ఉన్నా, ఈసారి ఐదుగురుకి చోటు కల్పించాలని భావిస్తున్నారట. రేవంత్‌రెడ్డి కేబినెట్‌లో కొన్ని జిల్లాలకు ఎక్కువ ప్రాతినిధ్యం దక్కగా, కొన్ని జిల్లాలకు అసలు చోటు లేదు. ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు సంబంధించిన నేతలెవ్వరూ లేరు. ఈసారి ఆయా జిల్లాలకు ఛాన్స్ ఇవ్వాలన్నది అసలు పాయింట్. ఇప్పటికే బీఆర్ఎస్ నుంచి చాలామంది జాయిన్ అయ్యారు.. మరికొందరు రేపోమాపో కాంగ్రెస్‌లోకి రావాలని భావిస్తున్నారు. తమకు మంత్రివర్గం లో చోటు లేకపోయినా, మిగతా పదవులు ఇవ్వాలని కోరుతున్నట్లు పొలిటికల్ సర్కిల్స్ సమాచారం. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ముదిరాజ్‌లకు ప్రాతినిధ్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు కాంగ్రెస్ పెద్దలు. వారిలో ముక్తల్ నుంచి శ్రీహరికి రావచ్చని అంటున్నారు. రాజగోపాల్ రెడ్డి, గడ్డం వివేక్, ప్రేమసాగర్, సుదర్శన్‌రెడ్డి, మైనార్టీల నుంచి ఒకరు పేర్లు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఒక స్థానాన్ని ఖాళీగా ఉంచి, స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత దాన్ని భర్తీ చేయాలని భావిస్తున్నారట సీఎం రేవంత్‌రెడ్డి. కేబినెట్ విస్తరణ తర్వాత నాలుగైదు నెలల తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నట్లు సమాచారం.

## భారీగా మావోయిస్టులు ఆయుధాల డంప్ స్వాదీనం

ఖమ్మం: చర్ల మండల సరిహద్దు ఒడిశా-ఆంధ్రప్రదేశ్ సరిహద్దు బెజంగివాడ రిజర్వ్ ఫారెస్టులో ఒక పర్వత కుహూరంలో మావోయిస్టులు దాచిన ఆయుధాల డంప్ ను శుక్రవారం భద్రతా బలగాలు స్వాదీనం చేసుకున్నారు. దూలగండి గ్రామ సమీపంలో మావోయిస్టుల డంప్ నుంచి ఎస్బిఎంఎల్ గన్స్, బారేల్, ఎలక్ట్రిక్ డిటోనేటర్స్, జిలెటిన్ స్టిక్స్, డైరెక్షనల్ మైన్, సోలార్ ప్లేట్, వైర్, ఎల్పీజి సిలిండర్స్, స్విచులు, మెడిసిన్స్ భద్రతా బలగాలు స్వాదీనం చేసుకున్నారు.

## హైదరాబాద్ లో వెలుగు చూసిన భారీ మోసం




హైదరాబాద్: గోల్డ్ ట్రేడింగ్ ఇన్వెస్ట్ మెంట్ పేరుతో హైదరాబాద్ లో భారీ మోసం వెలుగు చూసింది. అధిక లాభాలు ఆశ చూపి 500 మంది వరకు ప్రహణేశ్వరి ట్రేడర్స్ ఎండీ రాజేష్ మోసం చేశారు. దీంతో తమకు న్యాయం చేయాలని బాధితులంతా ఆదివారం సీసీఎస్ ముందు ఆందోళనకు దిగారు. పెట్టిన సొమ్ముకు ఐదు నెల్లో రెట్టింపు ఇస్తానని రాజేష్ బాధికులకు నమ్మబలికాడు. తొలుత లాభాలు ఇవ్వగా ఇదంతా నిజమే అని నమ్మి మరింత మంది ఈ స్కీమ్ లో చేరారు. అలా ఒక్కొక్కరి దగ్గర నుంచి రూ.5 లక్షల నుంచి కోటి రూపాయల వరకు వసూలు చేసిన రాజేశ్.. ఆ తర్వాత పరారయ్యాడు. దీంతో మోసపోయామని గ్రహించిన బాధితులు న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించారు.

# కరీంనగరం.... చేతికి చిక్కుతుందా...?

కరీంనగర్, కరీంనగర్ రాజకీయం రంజుగా మారింది. మంత్రి పొన్నం ప్రభాకర్ వర్సెస్ మేయర్ వై.సునీల్ రావు అన్నట్లు రాజకీయం నడుస్తోంది. మేయర్ పదవి నుంచి సునీల్ రావు ను దింపడమే లక్ష్యంగా కాంగ్రెస్ పావులు కదుపుతుంది. కాంగ్రెస్ దూకుడుకు కళ్లెం వేసేలా గులాబీ సైన్యం సిద్ధమై వాగ్దాటి చేస్తుంది. నేతల మధ్య మాటల యుద్ధం సాగుతోంది. రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. కరీంనగర్ నగర్ పాలక సంస్థపై మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. ఏకపక్షంగా మంత్రి పొన్నం మున్సిపల్ పై నిర్వహించిన సమీక్షా సమావేశం రాజకీయ విమర్శలకు వేదికయింది. కార్పొరేషన్ అంటే ఐదులక్షల జనాభా, 60 డివిజన్లు, రూ.650 కోట్ల బడ్జెట్. స్థానిక ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి సంజయ్, స్థానిక ఎమ్మెల్యే గంగుల కమలాకర్, నగర మేయర్ సునీల్ రావు లకు కనీస సమాచారం ఇవ్వకపోవడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. స్మార్ట్ సిటీ పనులతోపాటు శానిటేషన్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, పన్నుల వసూలు, తాగునీటి సరఫరా, పలు అంశాలపై సమీక్షించిన మంత్రి పొన్నం అనవసర ఖర్చులు, అవకతవకలపై అధికారులను సుతిమెత్తగా మందలించారు. గత ప్రభుత్వం ప్రస్తుత పాలక వర్గం చేపట్టిన పనులపై విచారణకు ఆదేశించి మున్సిపల్ అధికారులతోపాటు పాలక పక్షానికి భయాందోళనకు గురి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన అందిస్తుందని ఏ పని చేపట్టినా జవాబుదారిగా ఉండాలని ఆదేశించి పనితీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. పరోక్షంగా పాలక పక్షానికి చురకలు అంటించారు. ప్రతిపాదన లేకుండా వ్యయాన్ని పెంచేసి చేపట్టిన పనులపై అసహనం వ్యక్తం చేస్తు తప్పు జరిగినట్లు నిరూపణ అయితే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను ఆదేశించారు. నగరపాలక సంస్థ ప్రగతి పనుల పై మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షించడం... ముందు జాగ్రత్తగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించడం బాగానే ఉన్నా స్థానిక ప్రజాప్రతినిధులకు పాలకవర్గానికి సమాచారం ఇవ్వకుండా సమీక్ష సమావేశం నిర్వహించడమే ఇప్పుడు వివాదాస్పదంగా మారింది. మంత్రి పొన్నం పై మేయర్ సునీల్ రావు ఫైర్ అయ్యారు. పొన్నం ప్రభాకర్ కరీంనగర్ జిల్లా ఓటర్ కాదని, కరీంనగర్ తో సంబంధం లేని వ్యక్తి మున్సిపల్ కార్పొరేషన్‌పై సమీక్ష నిర్వహించడం ఏంటనీ ప్రశ్నించారు. కరీంనగర్ ప్రజలు 3 సార్లు ఓడగొట్టారని విధి లేక పక్క జిల్లా సిద్దిపేటలోని హుస్నాబాద్ కు పారిపోయాడని ఆరోపించారు. అలాంటి వ్యక్తికి కరీంనగర్ పై పెత్తనం ఏంటని ప్రశ్నించారు. పొన్నం ప్రభాకర్ కు కరీంనగర్ తో సంబంధం లేదని అందుకు ఆయనకు సిద్దిపేట జిల్లా అధికారులు కెటాయించిన సెక్యూరిటీయే నిదర్శనమన్నారు. కరీంనగర్ జిల్లా ఇన్చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉండగా జిల్లాకు సంబంధం లేని వ్యక్తి పొన్నం ప్రభాకర్ సమీక్ష చేయడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. కరీంనగర్ ప్రజలు 3 సార్లు ఓడగొట్టారని కసితో ఉన్న పొన్నం, నగర పాలక సంస్థపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అభివృద్ధి పై పొన్నంకు అంత శ్రద్ధ ఉంటే రాజకీయంగా జన్మనిచ్చిన హుస్నాబాద్ పై సమీక్ష పెట్టుకోండని ఉచిత సలహా ఇచ్చారు. మీరు అధికారం లో ఉన్నపుడు ఏమి అభివృద్ధి చేసారో అందరికీ తెలుసన్నారు. కేంద్ర ప్రభుత్వం కరీంనగర్ నగరపాలక సంస్థ కు 4 కోట్ల క్యాష్ అవార్డు ఇచ్చారని అది మీ కండ్లకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. నగరాన్ని సర్వాంగ సుందరముగా తీర్చిదిద్దాం..35 చోట్ల ఓపెన్ జిమ్ లు ఏర్పారు చేసాము...ఇంకా 30 ఏర్పాటు చేస్తామని తెలిపారు. హోదాలో ఉన్న పొన్నం అన్ని తెలుసుకొని మాట్లాడాలని సూచించారు. అధికారులను పాలక వర్గాన్ని భయపెట్టే మనస్తత్వం మార్చుకోవాలని హితవు పలికారు. కేంద్రం నుండి నిధులు మంజూరు చేయించింది ఎంపీ బండి సంజయ్ అని తెలిపారు. నగర అభివృద్ధికి బండి సంజయ్ సహకరించారు... మీరు ఏమి చేశారో చెప్పండన్నారు. పొన్నం చేసే ఆరోపణలపై ఎలాంటి విచారణకైనా సిద్ధమని మేయర్ స్పష్టం చేశారుమంత్రి పొన్నం ప్రభాకర్ పై మేయర్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేయడం పట్ల కాంగ్రెస్ శ్రేణులు అగ్గి మీద గుగ్గిలమయ్యారు. గడిచిన నాలుగున్నర ఏళ్లలో నగరపాలక సంస్థను అవినీతి మయంగా మార్చి మేయర్ కోట్లాది రూపాయల ఆస్తులు కూడబెట్టారు ఆరోపించారు. అతని నుంచి నగరపాలక సంస్థను కాపాడాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ లో పుట్టిపెరిగిన వ్యక్తిగా.. రాష్ట్ర మంత్రి గా ఉమ్మడి జిల్లా వాసిగా కరీంనగర్ నగర్ పాలక సంస్థ పనితీరుపై సమీక్ష నిర్వహిస్తే మేయర్ కు ఎందుకు కడుపుమంట అని ఇటీవల బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరిన కార్పోరేటర్ లు తోపాటు కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించారు. నగరపాలక సంస్థ విషయంలో కాంగ్రెస్ బిఆర్ఎస్ మధ్య పరస్పర ఆరోపణలు విమర్శలు నేతల మధ్య మాటల యుద్ధానికి రాజకీయ కక్ష సాధింపులో భాగమనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కరీంనగర్ మేయర్ అయిన సునీల్ రావు, ఏ పదవిలో లేని మాజీ ఎంపీగా ఉన్న పొన్నం ప్రభాకర్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల నిరసిస్తూ నిరసన ఆందోళన చేపడితే పొన్నం ఒక స్క్రాప్ అని విమర్శించారు. ఆ మాటను మదిలో పెట్టుకున్న పొన్నం ప్రస్తుతం మంత్రి కావడంతో తానంటే ఏమిటో నిరూపించేందుకు నగరపాలక సంస్థపై నజర్ వేసినట్లు ప్రచారం జరుగుతుంది. భాగంగానే మున్సిపల్ పై సమీక్ష సమావేశం నిర్వహించి అధికారులను ఉరుకులు పరుగులు పెట్టించడమే కాకుండా గతంలో చేపట్టిన పనుల్లో నాణ్యత లోపం అవినీతి అక్రమాలపై చర్యలు తీసుకోవడంతో పాటు పాలకవర్గాన్ని బద్నాం చేసే ప్రయత్నం జరుగుతుందని నగర ప్రజలు భావిస్తున్నారు. ఒకప్పుడు ఒక్క తాను ముక్కలే అయిన మేయర్, మంత్రి ఇప్పుడు అధికార విపక్షంగా మారి ఆధిపత్యం కోసం రాజకీయ డ్రామాకు తెరలేపారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

## 26న పాఠశాలల బంద్..విద్యార్థుల రాజకీయ పార్టీ



హైదరాబాద్ : ఫీజు నియంత్రణ చట్టం అమల్లోకి తీసుకురావడంలో ప్రభుత్వం విఫలమైనందుకుగాను ప్రభుత్వ పాఠశాలలో కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమైనందుకు పాఠశాలల బందుకు పిలుపునిస్తుంది. కావున ప్రతి ఒక్క ప్రయివేటు ప్రభుత్వ పాఠశాలలు స్వచ్ఛందంగా బందుకు సహకరించాలని విద్యార్థుల రాజకీయ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులుసునీల్, జీహెచ్ఎంసీ అధ్యక్షులు సుఖేందర్ రెడ్డి మహిళా అధ్యక్షురాలు సాత్వికా రెడ్డి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కమలాకర్ నవీన్ బాబు అనికేత్ తదితరులు పాల్గొన్నారు

## కొట్టుకుపోయిన అందవెల్లి పెద్దవాగు తాత్కాలిక వంతెన



### - నిలిచిపోయిన మూడు మండలాల రాకపోకలు

దహెగాం: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం అందవెల్లి వద్ద పెద్దవాగుపై నిర్మించిన వంతెన పిల్లర్లు కుంగి పోవడంతో తాత్కలిక వంతెన వేశారు. శనివారం రాత్రి ఎగువన కురిసిన భారీ వర్షాలకు పెద్దవాగులో వరద నీరు చేరడంతో ఆ తాత్కాలిక వంతెన కొట్టుకుపోయింది. దాంతో కాగజ్‌నగర్ మండలంలోని పలు గ్రామాలతో పాటు దహెగాం, భీమిని మండలాలకు రవాణా సౌకర్యం నిలిచిపోయింది. దీంతో వివిధ పనుల నిమిత్తం నిత్యం కాగజ్‌నగర్‌కు వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే అప్రోచ్ నిర్మాణం పూర్తిచేయాలని ఆయా మండలాల ప్రజలు కోరుతున్నారు.

# ఆస్ట్రేలియా పొగరు అణచడానికి సరైనోడ్ని దించుతున్న రోహిత్.. ఇక దబిడిదిబిడే!

టీ20 వరల్డ్ కప్ లో అసలైన పోరుకు సిద్ధమవుతోంది టీమిండియా. ఇప్పటివరకు చిన్నా చితకా జట్లతో ఆడుతూ వచ్చిన రోహిత్ సేన.. ఇప్పుడు సరైన ప్రత్యర్థితో తలపడనుంది. ఆస్ట్రేలియాతో సూపర్ పోరులో తాడోపేడో తేల్చుకోనుంది. ఇప్పటికే సూపర్-8లో రెండు వరుస విజయాలతో గ్రూప్ టాపర్ గా ఉంది భారత్. మొదటి మ్యాచ్ లో ఆఫ్ఘానిస్థాన్ ను చిత్తు చేసిన మెన్ ఇన్ బ్లూ.. సెకండ్ గేమ్ లో బంగ్లాదేశ్ ను మట్టికరిపించింది. అయితే రెండు మ్యాచుల్లో నెగ్గిన మన జట్టుకు సెమీస్ బెర్త్ అఫీషియల్ గా కన్ఫర్మ్ కాలేదు. ఇవాళ ఆసీస్ ను ఓడిస్తే నేరుగా సెమీస్ కు చేరుకోవచ్చు. ఒకవేళ ఓడినా స్మాల్ మార్జిన్ తో ఓడాలి. భారీ తేడాతో ఓడిపోతే క్వాలిఫికేషన్ కష్టమయ్యే ప్రమాదం ఉంది. అటు కంగారూలు గెలిస్తే తప్ప సెమీస్ కు వెళ్లలేని సిచ్యువేషన్. ఆ రకంగా రెండు జట్లకు ఈ మ్యాచ్ ఎంతో కీలకంగా మారింది. భారత్-ఆసీస్ కే కాదు.. ఆఫ్ఘానిస్థాన్ కు కూడా ఇది క్రూషియల్ మ్యాచ్. ఎందుకంటే ఇవాళ గనుక కంగారూ జట్టు ఓడిపోతే ఆఫ్ఘాన్ సెమీస్ కు చేరుతుంది. అందుకే ఈ మ్యాచ్ మీద అందరి ఫోకస్ నెలకొంది. భారత్ ముందు సెమీస్ క్వాలిఫికేషన్ తో పాటు మరో సవాల్ కూడా ఉంది. అదే రివేంజ్. గతేడాది స్వదేశంలో జరిగిన వన్డే ప్రపంచ కప్-2023 ఫైనల్ లో ఆసీస్ చేతిలో ఓడి కప్పును చేజార్చుకుంది టీమిండియా. కాబట్టి ప్రతీకారానికి ఇదే సరైన సమయం. ఈ మ్యాచ్ లో ఓడిస్తే సెమీస్ కు ముందే కంగారూల కథ ముగుస్తుంది. అందుకే పకడ్బందీగా సన్నాహకాలు చేస్తోంది రోహిత్ సేన. గెలుపు కోసం బలమైన వ్యూహాలు పన్నుతోంది టీమ్ మేనేజ్ మెంట్. ఈ క్రమంలోనే ఆసీస్ పొగరు అణచడానికి ప్లేయింగ్ ఎలెవన్ లోకి అసలైనోడ్ని దించుతున్నారని తెలుస్తోంది. స్పీడ్ గన్ మహ్మద్ సిరాజ్ ను ఆడించాలని ఫిక్స్ అయ్యారని సమాచారం.



బంగ్లాదేశ్ మీద ఆడిన టీమ్ నే ఆసీస్ మ్యాచ్ కూ కంటిన్యూ చేయనున్నారని తెలిసింది. బ్యాటింగ్, బౌలింగ్ లో దాదాపుగా ఎలాంటి ఛేంజెస్ ఉండవట. అయితే ఒక్క మార్పు మాత్రం ఖాయమని సమాచారం. స్పిన్ ఆల్ రౌండర్ అక్షర్ పటేల్ ప్లేస్ లో సిరాజ్ టీమ్ లోకి ఎంట్రీ ఇవ్వడం గ్యారెంటీ అని టాక్ నడుస్తోంది. ఈ మ్యాచ్ కు ఆతిథ్యం ఇస్తున్న సెయింట్ లూసియా మైదానం వికెట్, కండీషన్స్ కు తగ్గట్లు సిరాజ్ ఆయుధాన్ని వాడాలని ఫిక్స్ అయ్యాడట కెప్టెన్ రోహిత్. ఈ మధ్య కాలంలో అంతగా ఫామ్ లో లేకపోయినా తనదైన రోజున అతడు ఏమైనా చేయగలడు. పిచ్ తో పాటు అక్కడ భారీగా వీచే గాలిని వాడుకొని సిరాజ్ తన పేస్ తో మ్యాజిక్ చేస్తాడని మేనేజ్ మెంట్ భావిస్తోందట. బిగ్ మ్యాచెస్ లో ఆడిన అనుభవం, కసిగా స్పెల్స్ వేసే సత్తా ఉండటం, కండీషన్స్ అనుకూలిస్తే రెచ్చిపోయి అపోజిషన్ టీమ్స్ ను ఇరుకున పెట్టడం తెలుసు కాబట్టే అక్షర్ ను కాదని సిరాజ్ వైపు హిట్ మ్యాన్ మొగ్గుచూపాడని తెలుస్తోంది. మరి.. భారత ప్లేయింగ్ ఎలెవన్ లో సిరాజ్ ఉండాలని మీరు భావిస్తే కామెంట్ చేయండి.

# జింబాబ్వేతో టీ20 సిరీస్‌కు భారత జట్టు ప్రకటన.. కెప్టెన్‌గా శుబ్‌మన్ గిల్

టీ20 వరల్డ్‌కప్-2024 ముగిసిన తర్వాత టీమిండియా జింబాబ్వే పర్యటనకు వెళ్లనుంది. ఈ పర్యటనలో భాగంగా ఐదు టీ20ల సిరీస్‌లో ఆతిథ్య జట్టుతో భారత్ తలపడనుంది.

ఈ నేపథ్యంలో జింబాబ్వేతో టీ20 సిరీస్‌కు 15 మంది సభ్యులతో కూడిన భారత జట్టును బీసీసీఐ సెలక్షన్ కమిటీ సోమవారం ప్రకటించింది.

ఈ సిరీస్‌కు ప్రస్తుత టీ20 వరల్డ్‌కప్‌లో భాగమైన భారత ఆటగాళ్లంతా దాదాపుగా దూరమయ్యారు. సంజూ శాంసన్, యశస్వీ జైశ్వాల్ మినహా మిగితా ఆటగాళ్లందరికి సెలక్టర్లు విశ్రాంతి ఇచ్చారు. దీంతో ఈ పర్యటనలో భారత జట్టుకు యువ ఓపెనర్ శుబ్‌మన్ గిల్ సారథ్యం వహించనున్నాడు.

ఇక ఐపీఎల్‌లో అదరగొట్టిన యువ ఆటగాళ్లు అభిషేక్ శర్మ, తెలుగు తేజం నితీష్ కుమార్ రెడ్డి, రియాన్ పరాగ్, తుషార్ దేశ్ పాండే, హర్షిత్ రాణాకు తొలిసారి భారత జట్టులో చోటు దక్కింది. జూలై 6న హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరగనున్న తొలి టీ20తో ఈ సిరీస్ ప్రారంభం కానుంది.

జింబాబ్వే సిరీస్‌కు భారత జట్టు



శుబ్‌మన్ గిల్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, రుతురాజ్ గైక్వాడ్, అభిషేక్ శర్మ, రింకు సింగ్, సంజు శాంసన్ (వికెట్ కీపర్), ధృవ్ జురెల్ (వికెట్ కీపర్), నితీష్ రెడ్డి, రియాన్ పరాగ్, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, అవేష్ ఖాన్, ఖలీల్ అహ్మద్, ముఖేష్ కుమార్ , తుషార్ దేశ్‌పాండే.

# జింబాబ్వే టూర్‌కు టీమ్‌ని ప్రకటించిన బిసిసిఐ.. తెలుగోడికి చోటు..

జులై నెలలో టీమిండియా జింబాబ్వే పర్యటనకు వెళ్లనుంది. ఈ టూర్లో జింబాబ్వేతో మొత్తం 5 టి20 ల సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్ లో భాగంగా సీనియర్ ఆటగాళ్ల అందరికీ బీసీసీఐ విశ్రాంతి ఇచ్చినట్టుగా కనబడుతుంది. ముఖ్యంగా కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, హార్దిక్ పాండ్యా, సూర్య కుమార్ యాదవ్, రవీంద్ర జడేజా, సీనియర్ బౌలర్ బుమ్రాలు అందరూ ప్రస్తుతం జరుగుతున్న టి20 ప్రపంచ కప్ లో భాగంగా బిజీగా ఉండడంతో వారికి విశ్రాంతిని ఇచ్చింది బీసీసీఐ.

జులై 6న మొదటి టి20 మొదటి మ్యాచ్ జరగనుండగా జూలై 14న 5వ టి20 తో సీరియస్ ముగుస్తుంది. ఈ సిరీస్ గాను తాజాగా బీసీసీఐ టీంను ప్రకటించింది. యువ ఆటగాళ్లతో కూడిన జట్టుకు శుభమన్ గిల్ సారధ్య బాధ్యతలు నిర్వహించనున్నాడు. ఇక ఈ లిస్టులో ఐపీఎల్ లో సత్తా చాటిన తెలుగు ఆటగాడు అభిషేక్ శర్మతోపాటు, పరాగ్ లకు చోటును కల్పించారు.

ఇక ప్రకటించిన ఆటగాళ్ల వివరాలు చూస్తే.. శుభమన్ గిల్ (%జ%),




యశస్వి జైస్వాల్, రుతురాజ్ గైక్వాడ్, అభిషేక్ శర్మ, రింకు సింగ్, సంజు శాంసన్ (%ఔ%), ధృవ్ జురెల్ (%ఔ%), నితీష్ రెడ్డి, రియాన్ పరాగ్, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, అవేష్ ఖాన్, ఖలీల్ అహ్మద్, ముఖేష్ కుమార్, తుషార్ దేశ్‌పాండేలు ఉన్నారు.

# 41 పరుగులు లేదా 32 బంతులు.. రోహిత్ సేనకు స్కెచ్ గీసిన ఆసీస్.. అదే జరిగితే టీమిండియా ఫ్యాన్స్‌కు నిరాశే

టీ 20 ప్రపంచకప్ 2024లో భాగంగా 51వ మ్యాచ్ ఈరోజు భారత్, ఆస్ట్రేలియా మధ్య జరగనుంది. డారెన్ షమీ నేషనల్ స్టేడియం వేదికగా జరగనున్న ఈ మ్యాచ్ ఇరు జట్లకు కీలకం.

ఎందుకంటే గ్రూప్-1లో నాలుగు జట్లు సెమీఫైనల్ రేసులో ఉన్నాయి. నెట్ రన్ రేట్ ఆధారంగా ఈ జట్ల సెమీఫైనల్ స్థానం ఖరారు కావడం విశేషం.

ఇక్కడ టీమ్ ఇండియా గెలిస్తే నేరుగా సెమీఫైనల్ దశకు చేరుకుంటుంది. ఓడిపోతే మాత్రం లెక్కలన్నీ మారిపోతాయి. ఎందుకంటే, ప్రస్తుతం పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉన్న భారత జట్టు రెండో స్థానానికి దిగజారాలంటే ఆస్ట్రేలియాకు భారీ విజయం దక్కాల్సి ఉంటుంది. టీమిండియాపై ఆస్ట్రేలియా ఘనవిజయం నమోదు చేస్తే.. ఆసీస్ జట్టు అగ్రస్థానంతో సెమీస్‌లోకి ప్రవేశించనుంది. ఇప్పుడు భారత్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య నెట్ రన్ రేట్ లెక్క తేలనుంది.

తద్వారా నేటి మ్యాచ్‌లో ఆస్ట్రేలియా జట్టు 41 పరుగుల 32 బంతుల స్కోరుతో బరిలోకి దిగనుంది. దీని ద్వారా టీ20 ప్రపంచకప్ నుంచి టీమిండియాను ఔట్ చేసేందుకు ఆస్ట్రేలియా మాస్టర్ ప్లాన్ వేసింది.

నెట్ రన్ రేట్ ఎలా లెక్కిస్తారు?

ఈరోజు జరిగే మ్యాచ్‌లో ఆస్ట్రేలియా కనీసం 41 పరుగుల తేడాతో భారత జట్టుపై గెలిస్తే పాయింట్ల పట్టికలో మొదటి స్థానానికి చేరుకుంటుంది.

అలాగే, కనీసం 32 బంతులు మిగిలి ఉండగానే టీమిండియా లక్ష్యాన్ని ఛేదించినా.. పాయింట్ల పట్టికలో ఆస్ట్రేలియా అగ్రస్థానంలో ఉంటుంది. దీని ద్వారా సెమీఫైనల్‌కు వెళ్లవచ్చు.

టీమ్ ఇండియా 41 పరుగులు లేదా 32 బంతుల్లో ఓడిపోతే పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి పడిపోతుంది. దీంతో పాయింట్ల పట్టికలో



ఆఫ్ఘనిస్థాన్ జట్టు 2వ స్థానానికి చేరుకునే అవకాశాలు పెరుగుతాయి. దీని ప్రకారం బంగ్లాదేశ్‌పై ఆఫ్ఘనిస్థాన్ జట్టు 81 పరుగుల తేడాతో గెలిస్తే.. నెట్ రన్ రేట్ సాయంతో భారత జట్టును అధిగమించి సెమీస్‌లోకి ప్రవేశించవచ్చు.

ఆస్ట్రేలియా ఓడితే?

భారత్‌పై ఆస్ట్రేలియా ఓడిపోతే టీమ్ఇండియా నేరుగా సెమీస్‌లోకి చేరుతుంది.

ఆస్ట్రేలియా ఓడిపోతే బంగ్లాదేశ్‌తో జరిగే చివరి మ్యాచ్‌లో అఫ్గానిస్థాన్ గెలిచి సెమీస్‌లోకి ప్రవేశించవచ్చు.

ఆస్ట్రేలియాపై భారత జట్టు 55 పరుగులు లేదా 41 బంతుల తేడాతో గెలిస్తే బంగ్లాదేశ్ జట్టు కూడా సెమీఫైనల్‌లోకి ప్రవేశించే అవకాశం ఉంటుంది.

దీని ప్రకారం బంగ్లాదేశ్ జట్టు ఆఫ్ఘనిస్థాన్‌పై 31 పరుగులు లేదా 23 బంతుల తేడాతో గెలవాల్సి ఉంటుంది. దీని ద్వారా నెట్ రన్ రేట్ సాయంతో సెమీఫైనల్లోకి ప్రవేశించవచ్చు.

ఇలా నాలుగు జట్ల టీ20 ప్రపంచకప్ భవితవ్యాన్ని నేటి మ్యాచ్ ఫలితం తేల్చనుంది.

# 'మేకప్ బాయ్'ని బలిగొన్న స్విమ్మింగ్ పూల్.. షాక్‌లో మాజీ ఆల్‌రౌండర్

టీ20 వరల్డ్ కప్‌లో విషాదం నెలకొంది. భారత మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ మేకప్ ఆర్టిస్ట్ ప్రమాదవశాత్తూ మరణించాడు.

మెగా టోర్నీ కోసం పఠాన్‌తో సహా వెస్టిండీస్‌కు వెళ్లిన ఫయాజ్ అన్సారీ అనకోకుండా స్విమ్మింగ్ పూల్‌లో మునిగిపోయి ఊపిరాడక చనిపోయాడు. స్నానం చేసేందుకు ఈత కొలనులో దిగిన అతడు అందులో మునిగిపోయాడు. జూన్ 12 శుక్రవారం ఈ సంఘటన జరిగినట్టు సమాచారం. ఊహించని పరిణామంతో ఇర్ఫాన్ షాక్‌లో ఉండిపోయాడు. ఫయాజ్‌ది ఉత్తరప్రదేశ్‌లోని బిజ్నూర్. అతడికి రెండు నెలల క్రితమే పెండ్లి అయింది. ఈత కొలనులో మునిగి ఫయాజ్ మరణించాడనే వార్త తెలియగానే భారత్‌లోని అతడి కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ముంబైలో సెలూన్.. స్వగ్రామం నుంచి ముంబైకి మాకం మార్చిన ఫయాజ్ అక్కడ సొంతంగా సెలూన్ ప్రారంభించాడు. అతడి సెలూన్‌కు ఇర్ఫాన్ పఠాన్ మేకప్ కోసం, హెయిర్ స్టయిలింగ్ కోసం తరచూ వెళ్తుండేవాడు. ఇర్ఫాన్‌కు ఫయాజ్ వర్క్ చాలా నచ్చింది. దాంతో, అతడిని తన వ్యక్తిగత మేకప్ ఆర్టిస్టిగ్ నియమించుకున్నాడు. ప్రస్తుతం కామెంటేటర్‌గా కొనసాగుతున్న ఇర్ఫాన్ అప్పటి నుంచి ఫయాజ్‌ను తన వెంట




తీసుకెళ్లేవాడు. ఐపీఎల్ 17వ సీజన్‌లో.. ఇప్పుడు టీ20 వరల్డ్ కప్‌లో కోసం ఈ మాజీ ఆల్‌రౌండర్ తన స్టయిలిస్ట్‌తో సహా అమెరికా, వెస్టిండీస్‌లకు వెళ్లాడు. అయితే.. స్నానం చేసేందుకు ఈత కొలనులోకి దిగిన ఫయాజ్ అందులో మునిగిపోయి ప్రాణాలు విడిచాడు. దాంతో, ఫయాజ్ మృతదేహాన్ని భారత్‌కు తరలించేందుకు అవసరమయ్యే మొత్తం ఖర్చును ఇర్ఫాన్ భరిస్తున్నాడు. మరో రెండు మూడు రోజుల్లో ఫయాజ్ డెడ్ బాడీని కుటుంబ సభ్యులకు అప్పగించనున్నారు.

# ప్రతీకార పోరుకు వానముప్పు.. రద్దయితే పరిస్థితేంటి..?

టీ20 వరల్డ్ కప్‌లో సైమీ ఫైనల్ రేసు ఆసక్తిగా మారిన వేళ భారత్ , ఆస్ట్రేలియా లు కీలక పోరాటానికి సిద్ధమయ్యాయి.

సెయింట్ లుసియాలోని డారెన్ సమీ స్టేడియంలో ఇరుజట్లు ఆఖరి సూపర్ 8 మ్యాచ్‌లో అమీతుమీ తేల్చుకోనున్నాయి. నిరుడు నవంబర్ 19 వన్డే వరల్డ్ కప్ ఫైనల్లో ఓడించిన కంగారూలపై ప్రతీకారంతో రగిలిపోతున్న టీమిండియాకు ఎనిమిది నెలల తర్వాత సువర్ణావకాశం దొరికింది. ఈ మ్యాచ్‌లో భారత జట్టు గెలిస్తే.. మిచెల్ మార్ష్ సేన వరల్డ్ కప్ నుంచి ఇంటి దారి పడుతుంది. దాంతో, ఇంతకుమించిన రివెంజ్ ఉండదని మాజీ ఆటగాళ్లతో పాటు ఫ్యాన్స్ భావిస్తున్నారు. అయితే.. అభిమానులంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ మ్యాచ్‌కు వరుణుడి ముప్పు ఉంది. భారీ వర్షం పడే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. మ్యాచ్ రద్దయిందంటే.. ఒకవేళ సెయింట్ లూయిస్‌లో వాన పడితే మ్యాచ్ రద్దయ్యే చాన్స్ ఉంది. అదే జరిగితే సూపర్ 8లో రెండు విజయాలతో జోరుమీదున్న భారత జట్టు దర్జాగా సెమీస్‌కు దూసుకెళ్లుతుంది. మ్యాచ్ రద్దయిందంటే.. జూన్ 25న అఫ్గనిస్థాన్, బంగ్లాదేశ్ మ్యాచ్ ఫలితంపై కంగారూ జట్టు సెమీస్ ఆశలు ఆధారపడి ఉంటాయి. ఒకవేళ రషీద్ ఖాన్ సేన గెలిస్తే ఆసీస్ టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది. అలాకాకుండా కొన్ని ఓవర్ల ఆట సాధ్యమైతే మాత్రం రోహిత్ సేన కచ్చితంగా ఆసీస్‌ను చిత్తుగా ఓడించాలి. అప్పుడే ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్, వన్డే వరల్డ్ కప్ ఫైనల్లో ఎదురైన ఓటమికి ప్రతీకారం తీర్చుకున్నట్టుగా ఉంటుంది.

అఫ్గనిస్థాన్ చేతిలో.. టోర్నీ ఆసాంతం అదరగొట్టిన ఆసీస్.. అనూహ్యంగా అఫ్గనిస్థాన్ చేతిలో దారుణంగా ఓడింది. గుల్బదిన్ నయీబ్(4/20) విజృంభణతో 21 పరుగుల తేడాతో మ్యాచ్ చేజార్చుకుంది. మళ్లీ విజయంతో సెమీస్ బెర్తు దక్కించుకోవాలని మిచెల్ మార్ష్ సేన పట్టుదలతో ఉంది. రాత్రి 8 గంటలకు సెయింట్



లూయిస్‌లో భారత్, ఆస్ట్రేలియాలు తలపడనున్నాయి.

# ఆర్చరీ ర్యాంకింగ్స్‌లో హవా.. ఆ 'రెండింటి'లో బెర్తు కైవసం

భారత ఆర్చర్లు ఒలింపిక్స్ బెర్తు ఖరారు చేసుకున్నారు. పురుషుల, మహిళల కేటగిరీలో విశ్వ క్రీడల బెర్తు సాధించి డబుల్ ధమాకా మోగించారు.

సోమవారం వరల్డ్ ఆర్చరీ రాంకింగ్స్ విడుదల చేసింది. ఐదు పోటీల్లో భారత ఆర్చర్లు అర్హత సాధించారు. మహిళా, పురుష ఆర్చర్లు వ్యక్తిగత విభాగంలో.. మిక్స్‌డ్ కేటగిరీలో క్వాలిఫై అయ్యారు.

ఇక స్క్వాడ్ విషయానికొస్తే.. తరుందీప్ రాయ్ , ధీరజ్ బొమ్మదేవర, ప్రవీణ్ జాదవ్‌లు పురుషుల విభాగంలో పోటీ పడనున్నారు. మహిళల స్క్వాడ్‌లో సీనియర్ దీపికా కుమారి , యువకెరటాలు భజన్ కౌర్, అకింత భకత్‌లు విశ్వ క్రీడల బెర్తు దక్కించుకున్నారు.

మిక్స్‌డ్ ఈవెంట్‌లో.. భారత పురుష, మహిళా ఆర్చర్లు మూడంచెల ఎంపిక దశను దాటి మరీ ఒలింపిక్స్ రేసులో నిలిచారు. తాజాగా ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో టాప్‌లో నిలిచి విశ్వ క్రీడలకు అర్హత సాధించారు. చైనా ఆర్చర్లు కూడా పురుషుల కేటగిరీలో ఒలింపిక్స్‌కు క్వాలిఫై అయ్యారు.



మహిళల విభాగంలో ఇండోనేషియా ఆర్చర్లకు టీమ్ కోటా లభించింది. ప్రతి సెక్షన్‌లో 12 జట్లు పోటీ పడుతాయి. మిక్స్‌డ్ ఈవెంట్‌లో ఐదు జట్లు టైటిల్ వేటలో తలపడుతాయి.

# ఆ ఇద్దరు మెరిసేనా?

సూపర్8 దశ అంతిమ ఘట్టానికి చేరుకుంది. వరుస మ్యాచుల్లో విజయాలు సాధించిన భారత్.. నేడు చివరి మ్యాచ్‌లో ఆస్ట్రేలియాతో తలపడనుంది. అఫ్ఘాన్ చేతిలో ఓటమితో ఆసీస్ సెమీస్ అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది. నేడు భారత్‌తో మ్యాచ్‌లో నెగ్గితేనే ఆ జట్టు నిలుస్తుంది. ఒత్తిడి లేకుండా బరిలోకి దిగుతున్న టీమ్ ఇండియాకు ఫలితంపై పెద్దగా ఆందోళన లేదు కాదు. కానీ స్టార్ క్రికెటర్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ ఫామ్ తలనొప్పిగా మారుతోంది. గ్రాస్‌ఐలెట్ వేదికగా భారత్, ఆస్ట్రేలియా సూపర్8 సమరం నేడు.

గ్రాస్‌ఐలెట్: కోహ్లి, రోహిత్ రాణించేనా?

వరుస విజయాల ఊపుమీదున్న భారత్‌కు కీలక ఆటగాళ్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ ఫామ్ ఆందోళనగా మారింది. గ్రూప్ దశలో కోహ్లి పూర్తిగా నిరాశపరిచినా.. రోహిత్ ఓ అర్థ సెంచరీతో మెరిశాడు. సూపర్8లో దంచికొడ్తారని అనుకుంటే ఇక్కడ ఇద్దరూ విఫలమవుతున్నారు. భారత్ ధనాధన్ వ్యూహంతో ఆడుతోంది. దీంతో ఓవర్లో తొలి నాలుగు బంతులు బౌండరీ దాటినా.. చివరి రెండు బంతులను సైతం భారీ షాట్లు ఆడేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే రోహిత్, కోహ్లి వికెట్ పారేసుకుంటున్నారు. సహజశైలిలో ఆడుతూనే దండిగా పరుగులు రాబట్టే ప్రణాళిక ఈ ఇద్దరు తక్షణమే ఆలోచన చేయాలి. లేదంటే, కీలక సెమీఫైనల్ ముంగిట కోహ్లి, రోహిత్ భారత్‌కు బలహీనతగా మారే ప్రమాదం లేకపోలేదు. ఇక మిడిల్ ఆర్డర్ గొప్పగా కనిపిస్తోంది. రిషబ్ పంత్, సూర్యకుమార్ యాదవ్, శివం దూబె, హార్దిక్ పాండ్య ఫామ్‌లో ఉన్నారు. రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్‌లు బ్యాట్‌తో సత్తా చాటేందుకు ఎదురుచూస్తున్నారు. బౌలింగ్ విభాగంలో కుల్దీప్ యాదవ్ చేరిక వైవిధ్యత తీసుకొచ్చింది. కుల్దీప్ మాయ, బుమ్రా పేస్ ప్రత్యర్థులను హడలెత్తిస్తోంది. నేడు ఆసీస్‌పై అర్షదీప్, కుల్దీప్, బుమ్రా ఏం చేస్తారో చూడాలి.

కంగారూలకు చావోరేవో

అఫ్ఘాన్ చేతిలో ఓటమి ఆసీస్‌ను ఇరకాటంలో పడేసింది. నేడు భారత్ చేతిలో ఆసీస్ ఓడి.. తర్వాతి మ్యాచ్‌లో బంగ్లాపై అఫ్ఘాన్ నెగ్గితే ఎటువంటి సమీకరణాలతో పని లేకుండా నేరుగా అఫ్గనిస్థాన్ సెమీఫైనల్‌కు చేరుకోనుంది. భారత్‌పై గెలుపొందినా.. బంగ్లాపై అఫ్ఘాన్ విజయం సాధిస్తే నెట్ రన్‌రేట్ తెరపైకి రానుంది. దీంతో ఎటు చూసినా ఆస్ట్రేలియాకు నేడు సూపర్8 పోరు అత్యంత కీలకం. ఓటమి నైరాశ్యంలో ఉన్నప్పటికీ ఆస్ట్రేలియాను తక్కువ అంచనా వేయలేం. డెవిడ్ వార్నర్, ట్రావిశ్ హెడ్, మిచెల్ మార్ష్, గ్లెన్ మాక్స్‌వెల్, మార్కస్ స్టోయినిస్, టిమ్ డెవిడ్‌లు ఆసీస్‌కు కీలకం కానున్నారు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**